దేవి పార్ట్నర్స్‌లో దట్టమైన విషపు పొగలు



స్పృహతప్పి పడిపోయిన మహిళ

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని దేవి పార్ట్నర్స్ పరిశ్రమలో శనివారం దట్టమైన విషపు పొగలు రావడంతో పరిసర ప్రాంతాల గ్రామాలలో దుర్గంధ వాసనలు వ్యాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. కంపెనీ యాజమాన్యం అక్రమంగా ఇతర పరిశ్రమల నుంచి తెచ్చిన కెమికల్ వ్యర్థాలను తీసుకొచ్చి కాల్చడంతో దాని నుంచి వెదజల్లిన విషపు పొగల వాసనలతో దొంతి చౌరస్తాలోని కాలనీ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం సమయం నుంచి తెల్లవారు జాము వరకు దేవి పార్ట్నర్స్ కంపెనీ నుంచి విపరీతంగా ధ్వని శబ్దం రావడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, విషపు వాసనలతో అనారోగ్యం బారిన పడుతున్నామని దొంతి గ్రామస్తులు మండిపడుతున్నారు. కంపెనీలోని దుర్గంధం వెదజల్లడం, విపరీతంగా విషపు పొగలు వస్తున్నాయని, ఇందులో ఎం జరుగుతుందని ప్రశ్నిస్తే కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యపు సమాధానం చెపుతున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి దేవి పార్ట్నర్స్ కంపెనీపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
మెదక్
1
ఆదివారం | 23 మార్చి 2025 | www.navatelangana.com

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-సంగారెడ్డి



హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద గల ధర్నాకు వెళ్లకుండా తమతో పాటు సీఐటీయూ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయ రాజు, కార్యదర్శి జి.సాయిలు ఖండించారు. హైద రాబాద్ ధర్నాకు అనుమతి ఉన్నప్పటికీ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మారినా విధానాలు మారటం లేదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కాగా అంతకుముందు వారిని పోలీసులు పోలీసులు అరెస్టు చేసి.. స్టేషన్‌కు తరలించారు.

అసెంబ్లీలో సిద్దిపేట రైతుల సమస్యలు..

ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటలో రుణ మాఫీ అందరికి చేసాం అన్న బట్టి విక్రమార్క మాటలు ఉట్టివే అని, రుణమాఫీ.. అదొక దారుణ విషాద గాథ అని అసెంబ్లీలో మాజీ మంత్రి, హరీష్ రావు అన్నారు. భట్టి గత బడ్జెట్ ప్రసంగంలో రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ఘనంగా ప్రకటించారని, ఈ బడ్జెట్‌లోనేమో రూ.20 వేల కోట్లు ఇచ్చామంటున్నారని, కానీ వాస్తవానికి అది 15, 16 వేల కోట్లు కూడా దాటలేదని, మరి కడుపు కట్టుకోలేదో, అవినీతి ఆకలి ఆపుకోలేదో వారికే తెలియాలన్నారు. వాస్తవం ఏమిటంటే, రైతు ఇంటికి... బ్యాంకుకు మధ్య తిరుగుతూనే ఉన్నారన్నారు.

ఇంకా బాగా అర్థం కావాలంటే మా సిద్దిపేట నియోజకవర్గం పరిస్థితే ఉదాహరణగా చెబుతా అంటూ... బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులు 43,363 మంది, రుణమాఫీ అయ్యింది కేవలం 20,514 మంది, రుణమాఫీ కాని రైతులు 22,849 మంది. ఇందులో రూ.2 లక్షల లోపు కానివారు 10,212 ఉండటం గమనార్హమన్నారు. అంటే ఫైనల్‌గా రుణమాఫీ అయిన రైతుల సంఖ్య తక్కువ, రుణమాఫీ కాని రైతుల సంఖ్య ఎక్కువని అన్నారు. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న వారు మీదున్నది కట్టండి, మిగతాది మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆయన మాటలు నమ్మి చాలా మంది రైతులు అప్పు తెచ్చి పైసలు కట్టిన్రు అని అన్నారు. సిద్దిపేటలో అందరికి అయ్యాయి అన్న భట్టి మరి వీళ్ళ సంగతి ఏందో చెప్పు అని అన్నారు. మా సిద్దిపేట నియోజకవర్గంలోని గుర్రాలగొంది గ్రామంలో దమ్మర పల్లి శ్రీనివాస్ రెడ్డి అనే రైతు యూబిఐ బ్యాంకులో 30 ఆగస్టు 2024 నాడు రూ.50 వేలు కట్టిండు, నారాయణ రావు పేటకు చెందిన జి.సత్తి రెడ్డి అనే రైతు రూ.2.60 లక్షల రుణం ఉంటే, మిత్తితో కలిపి యూబిఐ బ్యాంకులో 76వేలు కట్టిండు, బంజేరుపల్లికి చెందిన మరో రైతు అక్తర్ ఖుస్రో రూ.2 లక్షల 600 అప్పు ఉంటే, మిత్తితో కలిపి మీదున్న రూ.10వేలు కట్టిండు అని అన్నారు. ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని, ఈ రోజుకూ వారికి రుణమాఫీ కాలేదు, ఎప్పుడు చేస్తారో చెప్పడం లేదు, ఇంత చర్చ ఎందుకు భట్టిగారు, మీ మధిరకు పోదామా? లేదా మా సిద్దిపేటకు వస్తారా? ఈ రాష్ట్రంలో ఏ ఊరుకు పోదామో మీరే చెప్పండి అని అన్నారు. వంద శాతం రుణమాఫీ జరిగి ఉంటే క్షమాపణలు చెప్పడానికి నేను సిద్ధం? కాకపోతే మీరు సిద్ధమా? అని ప్రశ్నించారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్

అకాల వర్షల వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి శనివారం అసెంబ్లీలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా రైతులకు అండగా నిలిచి వ్యవసాయ పంటలు వరితో పాటు ఇతర పంటల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఆమె కోరారు.



- ప్రత్యేక యాప్‌లను రూపొందించిన నిర్వాహకులు
- మ్యాచ్ అయ్యే వరకు సెల్‌ఫోన్‌లోనే యువత
- క్రికెట్ ఆటలో ప్రతిదానిపై పందాలే
- అన్‌లైన్‌లో బెట్టింగ్‌కు ప్రత్యేక ఐడీ...అడ్వాన్స్ చెల్లింపులు
- లక్షలు నష్టపోతున్న యువత...అప్పుల పాలై ఆత్మహ్యాతలు
- ఆన్‌లైన్ దందాపై నిఘా ఏదీ..?

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు క్రీడాభిమానులకు పండగ లాంటివి కాగా బెట్టింగ్ రాయుళ్లకు మాత్రం ఓ పెద్ద జాతర లాంటివి. కొందరు ఆటను చూసి ఆనందపడతారు. ఇంకొందరు ఆటను ఆటగానే చూస్తున్నారు. మరి కొందరేమో ఆటను జూదంగా భావిస్తున్నారు. ఇలా భావించే వాళ్ల ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న వేళ బెట్టింగ్ కాచి లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఎక్కువ మంది నష్టపోయే వాళ్లుండగా కొందరేమో లక్షలు సంపాదిస్తున్నారు. బెట్టింగ్ నిర్వహణ కోసం ప్రత్యేక యాప్‌లను రూపొందించిన నిర్వాహకులు యువతను ముగ్గులోకి దించి పందాలకు అలవాటు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి మే 25న జరిగే ఫైనల్ మ్యాచ్ వరకు ఆన్‌లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగే అవకాశాలున్నాయి. ఆధునీకతను ఉపయోగించుకుని యువత సెల్‌పోన్‌లోనే బెట్టింగ్ పెడుతున్నారు. ఒక చోట పోగవ్వాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆన్‌లైన్ బెట్టింగ్ దందాపై నిఘా పెట్టినప్పటికీ పందాలను అరికట్టే స్థాయిలో లేదనే చెప్పాలి.

ప్రత్యేక యాఫ్‌లలో సెల్‌పోన్‌లోనే బెట్టింగ్

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు నడుస్తుంటే అందులోని ప్రతి విభాగంపైనా యువత బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగ్ నిర్వాహకులు క్రికెట్ కోసం ప్రత్యేక యాప్‌లను రూపొందించారు. నేరుగా సెల్‌పోన్ ద్వారానే బెట్టింగ్ కాచేందుకు వీలు ఏర్పడింది. నిర్వాహకులు ప్రత్యేక యాప్‌లలో ముందస్తుగానే బెట్టింగ్ ఆడదల్చిన యువత నుంచి రూ.5 వేల నుంచి లక్షల వరకు డబ్బుల్ని ఫోన్‌పే, గూగుల్‌పే ఇతర ఆన్‌లైన్ పేమెంట్స్ చేయించుకుంటున్నారు. బెట్టింగ్ పెట్టేవాళ్లకు ప్రత్యేక ఐడీ కూడా ఇస్తున్నారు. సదరు ఐడీదారుడు రెగ్యులర్‌గా బెట్టింగ్ పెట్టిన ఎమౌంట్ చెల్లించేలా చూస్తున్నారు. ఒక వేల డబ్బులు పోగొట్టుకుని పేమెంట్ చేయలేని ఐడీలను అవసరమనుకుంటే బ్లాక్ చేస్తున్నారు.

ప్రతిదానిపైనా పందెం

క్రికెట్ ఇతర క్రీడల కంటే ప్రత్యేకమైన ఆటగా చూస్తాం. క్రికెట్‌లో బౌలర్, బ్యాట్స్‌మెన్, ఆల్‌రౌండర్, కీపర్ ఇలా వేర్వేరు విభాగాల్లో ఆడే వాళుంటారు. వీటితో పాటు అద్భుతమైన క్యాచ్‌లు, వండర్ త్రో ఇలా ప్రతిదీ క్రికెట్‌లో ప్రత్యేకంగా చూస్తాం. అందుకే బెట్టింగ్ రాయుళ్లు కూడా ప్రతి అంశంలోనూ బెట్టింగ్ కాస్తున్నారు. ప్రత్యేక యాప్‌లలో బంతి బంతికీ, రన్స్‌కు, ఒవర్‌కు, ఫోర్లు, సిక్స్‌లు, క్యాచ్‌లు, జట్టు విజయంతో పాటు టాస్‌పైన కూడా పందెం కాస్తున్న పరిస్థితి ఉంది. ఇలా యాప్‌లలో దేనిపైన ఎంతైనా పందెం కాచి బెట్టింగ్ పెట్టే అవకాశం కల్పిస్తున్నారు. యువత తమకు నచ్చిన టీమ్స్‌ను బట్టి బెట్టింగ్‌లో ఎమౌంట్ పెడుతున్నారు. ఫెవరేట్ క్రికెటర్‌ను బట్టి కూడా పందెం కాస్తున్నారు. అత్యధిక సార్లు కప్ గెల్చిన చైన్నై, ముంబయితో పాటు హైదరాబాద్, బెంగుళూర్, రాజస్థాన్, కోల్‌కతా, గుజరాత్ ఇలా ఇతర టీమ్స్‌ను బట్టి బెట్టింగ్ కాస్తున్నారు. కొందరైతే తమ అభిమాన క్రికెటర్ అంటే పడిచస్తారు. ధోనీ, కోహ్లీ, రోహిత్, గిల్, సూర్యకుమార్ యాదవ్, ఆర్థిక్‌పాండ్య, బూమ్రా, రిషబ్‌పంత్, శ్రేయస్ అయ్యర్ వంటి ఇండియా క్రికెటర్స్‌తో పాటు ఫారన్ క్రికెటర్లలోనూ మంచి ప్లేయర్స్ ఆటపైన కూడా బెట్టింగ్ కాస్తున్నారు.

అప్పుల ఊబిలో యువత...నిఘా పెంచాలి

బెట్టింగ్ పెట్టి ప్రతి సీజన్‌లోనూ యువత అప్పుల పాలవుతున్నారు. ఆటపై డబ్బులు పెడితే తక్కువ కాలంలోనే లక్షాధికారులు కావచ్చన్న అత్యాశతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఆటపై అంచనా లేకపోయినా ఉన్నా క్రికెట్ ఏ క్షణాన ఏ మలుపు తిరుగుద్దో ఆడేవాళ్లకు సైతం అంతు చిక్కదు. అయినా యువకులు ఆశపడి లక్షలు పెట్టి బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఆన్‌లైన్ నిర్వాహకులు బెట్టింగ్ రాయుళ్లను ఉసికొల్పేలా ఏఏ టీమ్స్ మ్యాచ్ ఆడుతాయో బెట్టింగ్ రేట్‌ను నిర్ణయిస్తారు. తక్కువ పెట్టి ఎక్కువ మొత్తంలో సంపాదించవచ్చన్న భ్రమలో పడి ఉన్న సొమ్మంతా గుల్ల చేసుకుంటున్న వాళ్లే అధికంగా ఉన్నాయి. అయితే బెట్టింగ్‌ను సైతం సొమ్ము చేసుకుని బాగుపడుతున్న వాళ్లు సైతం లేకపోలేదు. అయితే అత్యధిక మంది యువత మాత్రం నష్టపోతున్నారు. అప్పులు చేసి తట్టుకోలేక... ఇంట్లో చెప్పలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ సారైనా బెట్టింగ్‌ను అరికట్టేందుకు సరైన నిఘా పెంచి యువతకు అవగహన కల్పించాలని యువన సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

నిజాయితీ చాటిన ఉమెన్ కానిస్టేబుల్

దొరికిన ఫోన్‌ను ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అప్పగింత

నవతెలంగాణ-సంగారెడ్డి



దొరికిన మొబైల్ ఫోన్‌ను బాధితులకు అప్పగించి ఐటీసెల్ ఉమెన్ కానిస్టేబుల్ మమత నిజాయితీని చాటుకున్నది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గత శుక్రవారం రోజున మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ విరామంలో కానిస్టేబుల్ మమత ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో ఐటీఐ బస్‌స్టాండ్ వద్ద ఒక ఫోన్ దొరికింది. దాంతో ఆమె వెంటనే టెక్నికల్ సపోర్ట్‌తో ఆ ఫోన్ యజమాని వివరాలను సేకరించి.. అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు చేతుల మీదుగా బాధితులకు శనివారం అందజేశారు. కాగా మర్పల్లి మండలం నర్సాపూర్ తాండాకు చెందిన బాబ్య తన సొంత పని మీద సంగారెడ్డి పట్టణానికి వచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తిరిగి ఇంటికి వెళ్లేందుకుసంగారెడ్డి ఐటిఐ బస్‌స్టాండ్ వద్ద బస్సు ఎక్కే క్రమంలో ఫోన్ పోగొట్టుకున్నది. కాగా దొరికిన ఫోన్ గురించి వివరాలను సేకరించి, తిరిగి బాధితులకు అందించడంలో మమత నిజాయితీని చాటుకుందని అదనపు ఎస్పీ అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-చౌటకూర్



కార్మిక ప్రజా వ్యతిరేక విధనాలపై మే నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మండలంలోని శివంపేట గ్రామ శివారులో గల సీబీఎల్ పరిశ్రమలో ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ 11వ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై పోరుచేయాలన్నారు. ఈ నేపథ్యంలో మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను ఐక్యంగా కార్మికవర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీబీఎల్ పరిశ్రమ యూనియన్ అధ్యక్షులుగా చుక్కా రాములు, గౌరవ అధ్యక్షులు మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.బాగా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నా రావు, ఆఫీస్ బేరర్స్‌గా నాగ భూషణం, మల్లారెడ్డి,చంద్రయ్య, విష్ణు గౌడ్,కమిటీ సభ్యులుగా ఏం.విటల్, బి విట్టల్, లక్ష్మారెడ్డి వై మురళి, ఎండి జలీల్,వెంకటేష్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సీఐటయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ఉపా ధ్యక్షులు బాగారెడ్డి, ఎంప్లాయిస్ యూని యన్ కార్యదర్శి ప్రసన్న రావు, నాయకులు,ఎంప్లాయిస్,కార్మికులు పాల్గొన్నారు.

నిర్బంధాలు ఆపకపోతే ఉద్యమం ఉధృతం




నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రభుత్వం అక్రమ అరెస్టులు, నిర్బంధాలను ఆపకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి కే.రాజయ్య హెచ్చరించారు. రెండ్రోజులుగా రాష్ట్రంలో సీఐటీయూ నాయకులను, కార్యకర్తలను అన్ని జిల్లాల్లో అరెస్టులు చేయడం, ధర్నాలపై నిర్బంధాన్ని విధించడం నిరసిస్తూ పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్‌భవన్ నుంచి బస్టాండ్ వరకు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అరెస్టులు, నిర్బంధాన్ని అందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రకమైన నిర్బంధాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజా స్వామ్యం గురించి ప్రజా పాలన గురించి పదే పదే మాట్లాడుతున్న సీఎం.. హక్కుల కోసం సమస్యలు పరిష్కారం కోసం ఛలో హైదరాబాద్ వస్తుంటే ఎందుకు అరెస్టులు చేస్తున్నారని ప్రశ్నించారు. హైదరాబాదులో ధర్నాలకు ఎందుకు అనుమతి ఇవ్వట్లేదన్నారు. హైదరాబాద్ ధర్నాకు బయలుదేరే వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని, ఇదేనా ప్రజా ప్రభుత్వమని దుయ్య బట్టారు. రాష్ట్రవ్యాప్తంగా హామాలీ కార్మికులు, భవనిర్మాణ కార్మికులు, పరిశ్రమల కార్మికులు, బీడీ కార్మికులను, హమాలి కార్మికు లను, పరిశ్రమ కార్మికులను సీఐటీయూ నాయకులను రాష్ట్రమంతా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలు మానుకోవాలని, హైదరాబాదులో ధర్నాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజలు, కార్మికులందరూ రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించా లన్నారు. కార్మికుల సమస్యలపై రాబోయే కాలంలో మరిన్ని ఉద్యమాలు చేస్తామని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సంతోష్ గౌడ్, కిరణ్, శ్రీకాంత్, రాజశేఖర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ : సీఐటీయూ నాయకుల అరెస్టులను నిరసిస్తూ మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాబురావు మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు కోటి మంది అసంఘటితరంగా కార్మికులు ఉన్నారని.. వారికి సామాజిక భద్రత చట్టం తీసుకురావాలన్నారు. భవన నిర్మాణ కార్మి కులకు వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియ మించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని వారు కోరారు లేనిపక్షంలో పోరా టాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు వెంకయ్య, సంజీవులు, కిషన్, పుల్లయ్య, నాగరాజ్, కవిత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక అంశాలపై పట్టు.. ప్రగతికి మెట్టు

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఏదైనా కొత్త అంశాలను నేర్చుకునేటప్పుడు, దాని ప్రాథమిక అంశాలపై పట్టు సాధిస్తే, అది దానిపై లోతైన అవగాహనను పెంచి ప్రగతికి బాటలు వేస్తుందని గీతంలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థి, జైశ్రీరామ్.ఐవోలో టెక్ లీడ్ భరత్ భూసల్ అభిప్రాయ పడ్డారు. గీతం, హైదరాబాదులోని శిక్షణ, సామర్థ్య అభివృద్ధి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ గందగోళం ఆరంభం: స్టార్టప్ లు, బృందాలను నడిపించడం, అమలు చేయడం' అనే అంశంపై శనివారం ఆయన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేపాల్‌కు చెందిన భరత్, తన పరిశ్రమ అనుభవం, అభ్యాస ప్రయాణం నుంచి విలువైన విషయాలను తోటి ఔత్సాహిక విద్యార్థులతో పంచుకున్నారు. సాంకేతికత, స్టార్టప్‌ల సంక్లిష్టతలను అధిగమించడంపై కొత్త దృక్ఫథాన్ని అందించారు. నిరంతరం మారుతున్న సాంకేతిక రంగంలో రాణించాలంటే, ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం, నిరంతర సాధన, సవాళ్లను ఎదుర్కొంటూ స్థిరంగా ఉండడం ప్రాముఖ్యతను భరత్ నొక్కి చెప్పారు. అధునాతన సాంకేతికతలను సమర్థంగా నేర్చు కోవాల్సిన ఆవశ్యతకు వివరిస్తూ, పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా మారాలని స్పష్టీకరించారు. నిరంతరం ప్రగతిశీలంగా యోచించే మనస్తత్వాన్ని అలవరచుకోవాలని తోటి విద్యార్థులను ప్రోత్సహించారు. రెండు రోజులలో, నాలుగు గంటల పాటు సాగిన ఈ శిక్షణలో, సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్ లైఫ్ సైకిల్ (ఎస్ డీఎల్ సీ), గిట్-గిట్ హబ్, నిరంతర ఇంటిగ్రేషన్ (సీఐ), నిరంతర విస్తరణ (సీడీ) వంటి కీలకమైన పరిశ్రమ అంశాలను భరత్ వివరించారు. ఏడబ్ల్యూఎస్ వినియోగం, ఈసీ2 క్లౌడ్ సేవలను మెరుగుపరచడం, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సామర్థ్యాన్ని అన్వేషించడం వంటి అధునాతన భావాలను విద్యార్థులకు పరిచయం చేశారు. అలాగే ఓ స్టార్టప్‌ను ఎలా ప్రారంభించాలో ఆచరణాత్మకంగా వివరించారు. వ్యూహాత్మక అమ లుతో సాంకేతిక నైపుణ్యాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్య తను వివరించారు. జీవితంలో అత్యుత్తమంగా రాణించాలంటే, తరగతిలో చెప్పే బోధనకే పరిమితం కాకూడదని, మన ఆసక్తికి తగ్గ అంశాన్ని ఎంచుకుని, స్థిరంగా, అంకితభావంతో సాధన చేస్తే విజయాన్ని అందుకోగలమన్నారు. సహచర విద్యార్థులు సంధించిన పలు ప్రశ్నలకు తగిన జవాబులిచ్చి ఆకట్టకు న్నారు. తమ సహ విద్యార్థి అనుభవాలను తెలుసుకో వడానికి ఇతర ఔత్సాహిక విద్యార్థులు ఉత్సుకతను ప్రదర్శిం చారు. ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణను విజయ వంతంగా పూర్తిచేసిన వారికి వర్చువల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక వాతావరణంలో రాణిం చడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానానికి తగ్గట్టు తమ విద్యార్థులను సన్నద్ధం చేయడంలో గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం చాటి చెప్పిందనడంలో అతిశయోక్తి లేదు.

ప్రతీ నీటి చుక్కను ఒడిసి పడదాం

నవతెలంగాణ-గుమ్మడిదల




ప్రతీ నీటి చుక్కను ఒడిసి పట్టి జల సంరక్షణ చేద్దాం.. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి రాకుండా కాపాడుకుందాం అంటూ కానుకుంట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. సేవ్ ద వాటర్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ.. సమస్త జీవరాశికి ఆధారమైన ప్రతీ నీటి చుక్కను పొదుపుగా వాడుకొని జల సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్ తరాలను నీటిఎద్దడి నుండి కాపాడాలని సూచించారు. నీరును పొదుపు చేయాలని.. నీటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు పొదుపు చేయాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు నీటి బిందువు ఆకారంలో కూర్చొని భవిష్యత్ తరాలకు నీటిని అందించాలని సంకేతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, సువర్చల, రజిని, జ్యోతి, రత్న, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బీవీఆర్‌టీని సందర్శించిన కెనడా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు

నవతెలంగాణ-నర్సాపూర్ 71




నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాలను శనివారం కెనడా దేశ న్యూ బ్రున్స్‌విక్ విశ్వవిద్యాలయంలో బోధించిన ప్రొఫెసర్లు జాన్, ఎకెర్సావ ఐన, రొండా బొర్కులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం గురించి విలువైన సమాచారాన్ని ఇచ్చారు. యు.ఎన్‌బి కెనడాలో అత్యంత పురాతన విశ్వవిద్యాలయంగా ఇంగ్లీష్ భాషలో బోధన ప్రారంభించిన మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా, ఇంజనీరింగ్ విద్యను అందించిన మొట్టమొదటి కళాశాలగా గుర్తింపు పొందిందని వివరించారు. అదేవిధంగా గూగుల్ మ్యాప్స్, యుఎన్‌బి నుంచి ఆవిర్భవించిందని తెలియజేశారు. వాతావరణ పరిస్థితుల గురించి వివరణాత్మకంగా వివరించడంతోపాటు విద్యార్థుల జీవనశైలిని ప్రతిబింబించే వీడియోలు ప్రదర్శించారు. విభిన్న గ్రాడ్యుయేట్ కోర్సులు వాటి ముఖ్యంశాలు విద్యార్థులకు ఆర్థికంగా సాయపడే కో ఆప్ ప్రోగ్రాంల ప్రాధాన్యతను వివరించారు. అదనంగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఎస్‌విఈఎస్ యుఎన్‌బి మధ్య ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ కోర్సుల వివరాలు తెలియజేశారు. అన్ని ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రొఫెసర్ జవాబులు చెప్పారు. నూతన సాంకేతిక విదేశీ విద్యా కార్యక్రమాలు ఉద్యోగ అవకాశాల గురించి కెనడా ప్రొఫెసర్‌ని విద్యార్థులు వారి సందేశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దుబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి, సతీష్ చంద్ర, మేనేజర్ బాపిరాజు, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కోఆర్డినేటర్ ప్రణీత, వివిధ హెచ్ఓడిలు పాల్గొన్నారు.

బీసీల బిల్లు కొరకు మొక్కులు మొక్కుకున్న

బీసీ బిల్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-కొమురవెల్లి



తెలంగాణ జాగృతి మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీలకు విద్యా ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ కొరకు చర్చించే సమయంలో మోక్కులు మొక్కుకున్నానని ఇప్పుడు అసెంబ్లీలో 42శాతం బిల్లు పాసై తీర్మానం చేయడంతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నానని బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రాన్ని కవిత సందర్శించి స్వామివారికి బోనం తీసి పట్నం వేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె, జనగామ మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ జాగృతి మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ లకు విద్యా ఉద్యోగ రాజకీయపరంగా రిజర్వేషన్ కోసము చర్చించామని ఆ సమయంలో మోక్కులు మొక్కుకున్నానని ఇప్పుడు అసెంబ్లీలో 42శాతం బిల్లు పాసై తీర్మానం చేయడంతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నానన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి జరిగిందని కొమురవెల్లి మండల పరిధిలో 136 ఎకరాల భూమి స్వామివారి పేరున రాశారని గుర్తు చేశారు. ఎన్నో అభివృద్ధి పనులు చేశాడని కొనియాడారు. కొమురవెల్లి మల్లన్న పేరు మీదనే మల్లన్న సాగర్‌ను నిర్మించాడన్నారు. అంతేకాకుండా మండల కేంద్రం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. బీసీ బిల్లు పూర్తిగా అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులకు అమలుకు రాజ్యాంగపరమైన చిక్కులను తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సూచించారు.


జనగామ ఎమ్మెల్యే పల్లా వర్గం దూరం..?

ఎమ్మెల్సీ కవిత కొమురవెల్లి మల్లన్న ఆలయ దర్శనానికి వచ్చిన నేపథ్యంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఎవరు కనిపించలేదు. కేవలం ఒకరిద్దరి బీఆర్ఎస్ నాయకులతోనే కార్యక్రమం కొనసాగింది. అనూహ్యంగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఈ కార్యక్రమానికి రావడం, ఎమ్మెల్యే పల్లా వర్గ బీఆర్ఎస్ నాయకులు అక్కడ ఎవరు కనిపించకపోవడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. అసలు బీఆర్ఎస్‌లో ఏం జరుగుతుందని స్థానికంగా పలువురు చర్చించుకున్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు తమకు సమాచారం లేదంటూ వాపోయారు. బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కూతురు కల్వకుంట్ల కవిత కొమురవెల్లికి వచ్చిన సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు ఆయన వర్గం హాజరు కాకపోవడంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొన్నది.

జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది

పర్యవేక్షిస్తున్న అధికారులు



నవతెలంగాణ- జోగిపేట : జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఆస్పత్రి ఏరియాలోని ఫార్మసిస్ట్ స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో ఆస్పత్రి సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న జోగిపేట ఆర్డీవో పాండు, ఎస్సై పాండు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పి వేశారు. సిరంజీవులు, దూది ఉండడంతో కరెంట్ షాక్‌తో మంటలు చెలరేగినట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పూర్తి దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

ఎంఈఓపై వచ్చిన ఆరోపణలపై డీఈఓ విచారణ

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ ఎంఈఓ బసవ రాజ్ ప్రయివేటు విద్యాసంస్థలతో కుమ్మక్కై ఆయా పాఠశాలల విద్యార్థులు ఉన్న సెం టర్లలో వారికి అనుకూలమైన ఇన్విజి లెటర్లను నియమిస్తున్నారనే ఆరోప ణలపై డీఈఓ వెంకటేశ్వర్లు శనివారం విచారణ చేపట్టారు. జహీరాబాద్ మండ లంలో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ.. మొగుడంపల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయులను ఇన్విజిలెటర్లుగా ఎందుకు నియమించారో చెప్పాలని ఎంఈఓకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని వివిధ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.


గోంగ్లూరులో యువకుడి కిడ్నాప్

సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళీకృష్ణ అనుచరుల ఘాతుకం

పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు

నవతెలంగాణ-పుల్కల్





భూతగాదాలతో ఓ యువకుడి కళ్ళల్లో కారం చల్లి కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పుల్కల్ మండలం గోంగ్లూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే గొంగ్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్యకు అదే గ్రామ శివారులో సర్వే నంబర్ 794లో 6 ఎకరాల పట్ట భూమి కలిగి ఉన్నారు శనివారం సాయంత్రం పల్లె సంజీవయ్య తన సోదరుడు బాలయ్య కుమారుడు క్రాంతిలతో కలిసి వెళ్లారు. కాగా అదే పొలం పక్కన ప్రముఖ సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళీకృష్ణ వ్యవసాయ పొలం ఉన్నది. 6 ఎకరాల పట్టా భూమిలో నుంచి ఎకరంన్నర భూమిని పల్లె సంజీవయ్య హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. అయితే పక్కనే వ్యవసాయ పొలం కలిగి ఉన్న సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళి కృష్ణ ఈ భూమిపై కన్నేశారు. అమ్మితే భూమిని తనకే అమ్మాలని లేని ఎడల కబ్జా చేస్తానని ఎవరు అడ్డొస్తారో చూసుకుంటానంటూ గత కొంతకాలంగా బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇందులో భాగంగా అక్కడే కాపు కాస్తున్న సినీ నిర్మాత మేడికొండ వెంకటముడి కృష్ణ అనుచరులు సంజీవయ్య ఆయన సోదరుడు బాలయ్య కుమారుడు క్రాంతి కళ్ళల్లో కారం చల్లి మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారు. అయితే క్రాంతి కాళ్లు చేతులను కట్టేసి కళ్ళకు గంతలు కట్టి ఆటోలో అపహరించి సింగూరు ప్రాజెక్టు వైపు తీసుకువెళ్లారు ఈ విషయమై పల్లె సంజీవయ్య తన కుమారుడిని మురళీకృష్ణ అనుచరులు అపహరించి ఆటోలో తీసుకెళ్తున్నారంటూ జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్‌లకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళి కృష్ణకు ఫోన్ చేసి వార్నింగ్ ఇవ్వడంతో అపహరించిన యువకుడిని అదే గ్రామ శివారుకు తీసుకువచ్చారు గ్రామస్తులు అందరూ ఏకమై దుండగులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-జహీరాబాద్



మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని డీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటశాలను, సామగ్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అందులో ఏ విధమైన లోపాలు లేకుండా చూసుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని కూడా తెలుసుకోవడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు ఎంఈఓ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్



రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీతో కూడిన ఎల్ఆర్ఎస్‌ను మున్సిపాల్టీ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి కోరారు. కమిషనర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. రెండ్రోజుల్లో 98 మంది లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా.. సుమారు 36 మందికి ప్రొసీడింగ్ పత్రాలను కమిషనర్ అందించారు. ఈనెల 31 వరకు ఉన్న ఈ చివరి అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్‌పై మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇటీవల విలీనమైన గ్రామాల్లో బ్యానర్స్, మెసేజెస్, ఫోన్ కాల్స్, మైక్ ప్రచారాలను చేయించడం జరిగిందని మున్సిపాల్టీ అధికా రుల బృందం, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది సెలవు దినాల్లో కూడా పనిచేయడం పట్ల కమిషనర్ అభినందించారు. ప్రజలకు ఎల్ఆర్ఎస్‌పై ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు.

రెండోరోజు పరీక్షా ప్రశాంతం

99.82 విద్యార్థుల హాజరు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్సెస్సీ ద్వితీయ భాషా పరీక్షా ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాధికారి ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 22404 మందికి గాను 22363 మంది హాజరయ్యారని 41 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారన్నారు. హాజరు శాతం 99.82 ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్కాపూర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. కోహిర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పలు పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ 36 పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

నల్లపోచమ్మ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలంలో గల బోరంచ నల్ల పోచమ్మ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం డిమాండ్ చేశారు. పక్కనే మంజీరా నది.. అలాగే సంగమేశ్వర ఆలయం ఉందన్నారు. ఇక్కడ 100 ఎకరాల భూమి గవర్నమెంట్ భూమి ఉందని, ఫారెస్ట్ భూమిని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తే కొంత ఉపాధి వస్తుందన్నారు. నారాయణఖేడ్ వెనుకబడిన ప్రాంతమని.. ఇక్కడ ఉపాధి కల్పించేలా రూ.15 కోట్లు కేటాయించాలన్నారు.



ఏఈ ఉద్యోగం సాధించిన మహేష్‌కు సన్మానం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మున్సిపాల్టీలోని శాస్త్రినగర్‌కి చెందిన మచుకూరి మహేష్ పంచాయతిరాజ్ డిపార్ట్మెంట్‌లో ఏఈగా ఉద్యోగం సాధించాడు. దాంతో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మహేష్‌ను శాలువా కప్పి బొకేతో సన్మానించి అభినందించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-సంగారెడ్డి

అసెంబ్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు శ్రవణ్ రెడ్డి, సురేష్ నాయక్, మల్లేశంలను సంగారెడ్డి రూరల్ పోలీసులు తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ తరలించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని వారు ఆరోపించారు. సమైఖ్య రాష్ట్రంలో కూడా రేవంత్‌రెడ్డి లాగా ఎవరు నిర్బంధాలను విధించలేదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం అని ఎద్దేవా చేశారు. అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

హెచ్‌సీయూ భూముల వేలం వేయొద్దని అసెంబ్లీ ముట్టడి బయలుదేరిన బీఆర్ఎస్వీ నారాయణఖేడ్ డివిజన్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ డివిజన్ నాయకులు నరేష్ చుంటు, సాయి యాదవ్ ఉన్నారు.



ఎల్గోయిలో నీటి ఎద్దడి లేదు

నవతెలంగాణ-మనూర్

మండలంలోని ఎల్గోయి గ్రామములో నీటి ఎద్దడి లేదని గ్రామస్తులు అశోక్‌రావు పాటిల్, శివాజి రావ్ పాటిల్‌లు తెలిపారు. గ్రామంలో నీటి కష్టాలు ఉన్నాయని వస్తున్న వదంతులను ఖండించారు. పి.కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెండు బోర్లు వేయించారని.. వాటితోనే ఇప్పటికీ ప్రజల అవసరాలు తీరుతున్నాయన్నారు. కాగా మిషన్ భగీరథ నీరు కొంత మందికి రావట్లేదని.. వారు ఈ బోర్‌ల ద్వారా నీటిని వాడుకుంటు న్నారన్నారు.



నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయీబ్రాహ్మణుల విద్యుత్ బిల్లు సమస్యల పరిష్కరించాలని జిల్లా విద్యుత్ అధికారి శ్రీనాథ్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు మేలు చేసేందుకు హెయిర్ సెలూన్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తుందన్నారు. కానీ విద్యుత్ బిల్లులు మాత్రం వేలల్లో వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు బిల్లులు అడగటం లేదని, కానీ నెలనెల విద్యుత్ బిల్లులు వేలల్లో రావడం వల్ల షాపుల యజమానులు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తు న్నారన్నారు. ఈ సమస్యని పరిష్కరించాలని జిల్లా విద్యుత్ అధికారిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా విద్యుత్ అధికారి సానుకూలంగా స్పందించారని నాయి బ్రాహ్మణుల సమస్యనుపై అధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మురళి కృష్ణ, కోశాధికారి సత్యం, సంగారెడ్డి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, సంగారెడ్డి డివిజన్ అధ్యక్షులు చేర్యాల ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



అకాల వర్షాలు..
నేలకొరిగిన పంటలు



- వడగండ్లతో దెబ్బతిన్న పంటచేన్లు..
- ఆందోళనలో అన్నదాత
- పలుచోట్ల నేలకొరిగిన స్తంభాలు..
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

నవతెలంగాణ-జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్కల్, మునిపల్లి,

విపరీతమైన ఎండలు.. ఉక్కపోతలతో అతలాకు తలమైన జనాలకు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం కాసింత ఊరటనిచ్చింది. కానీ విపరీతమైన ఈదురు గాలులతో వర్షం పడడంతో.. పెద్ద ఎత్తున పంటలు నేలకొరి గాయి. మరోపక్క శనివారం కూడా వడగండ్ల వర్షాలు కురియడంతో రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే వరిపంట దాదాపు చేతికందే దశలో ఉన్నది. ఈ అకాల వడగండ్ల వర్షాల వల్ల ఆ పంట మొత్తం నాశనమవుతోంది. అలాగే మొక్కజొన్న, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే పంట నష్టానికి సంబంధించి అంచనాలు వేస్తున్నట్టు ఏడీఏ భిక్షపతి తెలిపారు.

జహీరాబాద్ డివిజన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పలు విద్యుత్ స్తంభా లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 25 విద్యుత్ స్తంభాలు నేలకొ రగడంతో 24 గంటల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం జరిగింది. కాగా వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ శాఖ అధికా రులు ఆయా ప్రాంతాలకు వెళ్లి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ డీఈ తెలిపారు. మరోపక్క ఈదురుగాలులు వీయడంతో సాయిజొన్న మక్క పంటలు నేలకొరిగాయి.

మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని కొల్లూర్, తుమ్మన్ పల్లి, బోప్పన్ పల్లి, సంఘం (కె), కంబాల పల్లి,గుంతమర్పల్లి, జీర్లపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలుల తో కూడిన వడగండ్ల వాన కురిసింది. దాంతో చేతికొచ్చిన జొన్న పంట నేలకొరిగింది. బోప్పన్‌పల్లిలో వడగండ్ల వాన వల్ల ఉల్లిపంట దెబ్బ తింది. రవాదారిపై చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు వచ్చి చెట్ల కొమ్మలను తొలగిం చడంతో రాకపోకలు కొనసాగాయి. మండల కేంద్రమైన ఝరాసంగంలో కేతకీ ఆలయానికి కొద్ది దూరంలో ఈదురుగాలుల వల్ల విద్యుత్ స్తంభం కూలింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్ సహాయంతో మరమ్మతులు చేశారు. శుక్రవారం రాత్రి ఝరాసంగంలో 12.4వర్షపాతం, రాయికో డ్‌లో 14.8, మొగుడంపల్లి మండలంలో 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

న్యాల్‌కల్ మండలంలోని చీకుర్తి, మామిడ్గి, రేజింతల్, టెకూర్, హద్నూర్, మెటల్‌కుంట, మిర్జాపూర్(బి), ముంగి గ్రామాల్లో ఈదురుగాలు లు, ఉరుములు మెరు పులతో వడగండ్ల వర్షం పడింది. దాంతో చేతికొచ్చిన జొన్న, శనగ, ఉల్లి గడ్డ పంటలు నేలవా లా యి. మరోపక్క ఈదురు గాలులతో విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోయిన్యాల్‌కల్, రేజిం తల్, గంగ్వార్, ముంగి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. చీకుర్తి, గుంజేటి, రామ్‌తీర్థం గ్రామాల్లో దెబ్బ తిన్న జొన్న, శనగ పంటలను వ్యవ సాయ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రస్తుత వర్షానికి ఎలాంటి నష్టం జరగలేదని మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ తెలిపారు.

మునిపల్లి మండలంలోని మేళాసంఘం, కంకోల్ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వడగండ్ల వర్షాలు కురిశాయి. ఈదురుగాళ్ళతో కురిసిన వడగండ్లు ధాన్యం ఆరబోసి నట్టుగా పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఈ వడగండ్లు తీవ్ర పంటనష్టం చేకూర్చుతాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షానికి మామిడి, జామ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.









పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో కుల వివక్షతపై పోరాటాలు

నవతెలంగాణ-కొండాపూర్



పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో కుల వివక్షతపై పోరాటాలు చేపట్టనున్నట్టు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ తెలిపారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) కొండాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతి బాపూలే, భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయ స్ఫూర్తితో కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రతిఘటనలు చేస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని యేండ్లు గడిచినా.. ఇంకా గ్రామాల్లో కుల వివక్షత, అంటరాని తనం పేదరికం కొనసాగడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.40.232కోట్లు ప్రతిపాదించారన్నారు. కానీ అంబేద్కర్ అభయ హస్తంకు ప్రతీయేడు రూ.750కోట్లు కేటాయించి ప్రతీదళిత కుటుంబా నికి రూ.12లక్షలు ఇస్తామని చెప్పారని.. కానీ అందుకనుగుణంగా నిధులు కేటాయించలేదన్నారు. కాబట్టి బడ్జెట్‌ను సవరించి ఈ సంవత్సరం నుండి అమలు చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి బ్యాంక్ లింకేజి లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. దళిత బస్తిలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని.. ప్రతినెలా పౌర హక్కుల దినం జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. మధుకర్, టీ. రాజు, సంజీవులు, ప్రవీణ్, వెంకన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

గంకత్వ పూడికను తీసి మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-సదాశివపేట



మండలంలోని గంకత్వ పూడికను తీసి మరమ్మత్తులు చేయాలని.. రైతులందరికీ ఉపయోగపడే విధంగా గంకత్వను వినియోగంలోకి తీసుకురావాలని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కమిటీ కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లా డుతూ.. గంకత్వ చెరువు మండల ప్రజలకు నిరుపయో గంగా తయారైందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గంకత్వకు మరమ్మత్తులు చేపించి రైతులందరికీ అందుబా టులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ గంకత్వ ఆయకట్టు కింద 11 గ్రామాల చెరువులకు నీరు వెళ్తున్నద న్నారు. ఈ చెరువులు నిండితే ఆయకట్టు మొత్తం పుష్కలంగా పంటలు పండే అవకాశం ఉందన్నారు. ఒక ప్పుడు ఈ గంకత్వ కాలువ ద్వారానే మండల రైతులకు ప్రధాన సాగునీరు వచ్చేదన్నారు. పాలకులు పట్టించుకోకపో వడంతో నేడు ఈ గంకత్వ నిరుపయోగంగా తయారైంద న్నారు. బడ్జెట్లో ఈ గంకత్వ పూడికకు చెరువుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో సీపీఐ(ఎం) నాయకులు భూషణం, ఎండి ఖయ్యూం, నర్సింలు, రాజు, శేఖర్, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

నవతెలంగాణ-జహీరాబాద్



విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని బీఆర్ఎస్వీ జహీరాబాద్ నియోజక వర్గ ఇన్‌ఛార్జి రాకేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి బయల్దేరిన బీఆర్ఎస్వీ నాయకులను జహీరాబాద్ పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో శనివారం జహీరాబాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన అనేక హామీలను విస్మరించారన్నారు. నిరుద్యోగ భృతి డుమ్మా కొట్టడమే కాకుండా జాబ్ క్యాలెండర్ ఎగవేసి విద్యార్థులను మోసం చేశారని ధ్వజమెత్తారు. అదేవిధంగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మొండి చేయిచూపెట్టారన్నారు. మహిళా విద్యార్థినులకు స్కూటీల పేరు చెప్పి ఓట్లు దండుకుని.. బడ్జెట్‌లో కనీసం ఆ ప్రస్తావనే చేయలేదని ఎద్దేవా చేశారు. ఫీజు రియంబ ర్స్మెంట్, స్కాలర్‌షిప్స్‌కు బడ్జెట్లో నిధులు కేటాయిం చలేదని మండిపడ్డారు. విదా ్యర్థుల హక్కుల కోసం బీఆర్ఎస్వీ ప్రశ్నిస్తే విద్యార్థి నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు మొదలై పదిరోజులు గడువకముందే ఇప్పటికే అనేకమార్లు విద్యార్థి నాయకులను రాత్రికి రాత్రే అరెస్టులు చేశారన్నారు. విద్యార్థుల జోలికి వస్తే ఊరుకోబోమన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షులు ఓంకార్, న్యాల్కల్ మండలాధ్యక్షులు మారుతియాదవ్, సీనియర్ బీఆర్ఎస్వీ నాయకులు పరశురాం, ఎం.డీ ఫయాజ్, రఘు తేజ, ఆవేజ్, అజీమ్,ఇక్బాల్, మహేష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రరాయి అక్రమంగా తరలిస్తున్న లారీ, ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-న్యాల్‌కల్



అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న ఓ ట్రాక్టర్, లారీని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. జహీరాబాద్‌రూరల్ సీఐ జక్కుల హనుమంతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హూసేల్లి సరిహద్దు చెక్‌పోస్ట్ దగ్గర హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్ సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా.. గణేష్‌పూర్ గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్, లారీలో ఎర్రరాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆ ఎర్ర రాయి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో.. ట్రాక్టర్, లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం లారీ, ట్రాక్టర్‌ను న్యాల్‌కల్ తహసీల్దార్‌కు అప్పగించినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య, రక్తదాన శిబిరాలు



నవతెలంగాణ-కౌడిపల్లి

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, సంగారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సంగారెడ్డి మెడికల్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్.అనూషా చౌదరిలు వైద్య సేవలు అందించారు. తునికి గ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా తునికి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆటలు ఆడించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మాణిక్యం రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి మాట్లడుతూ అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని అందరు రక్తదానం చేయాలని సూచించారు. 50 మందికి పైగా రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డా.పి.రమేష్, డా.ఎన్.హరి, డా.నీలాటికలు తెలిపారు. సాహిత్య, సంజన, శ్వేత, భావని, షాలినీ, మోహన్ బాబు,శ్రీ దుర్గ, నామ్‌దేవ్, భరత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

ఆదివారం | 23 మార్చి 2025 | www.navatelangana.com

ప్రతి మహిళ ఒక మొక్కను నాటి పోషించాలి

- ఎపీఎం గౌరీ శంకర్




నవతెలంగాణ-నర్సాపూర్

గ్రామంలోని ప్రతి మహిళ ఒక మొక్కను నాటి ఆ మొక్కకు మూడు సంవత్సరాల వరకు నీరు పోసి పోషించాలని ఎపీఎం గౌరీ శంకర్ అన్నారు. శనివారం తుజాల్పూర్ గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు మహిళల చేత మొక్కలు నాటించారు. పోషించిన మొక్కలను సమాజానికి అంకితం చేయాలని సూచించారు. నా మొక్క నా బాధ్యత, అమ్మ పేరు మీద మొక్క పేరున చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా తుజాల్పూర్ గ్రామంలోని ముత్యాలమ్మ గుడి చుట్టూ గ్రామ మహిళలు, గ్రామ యువత, పెద్దల ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డి ఎం జి దత్తాత్రి, సిసి భాగ్యలక్ష్మి, సీఏ నవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ప్రమాద నివారణకు చర్యలు


- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెట్లను తొలగిస్తున్న నాయకులు



నవతెలంగాణ-మనోహరాబాద్

గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు బీఆర్ఎస్ నాయకులు పంజా భిక్షపతి ముదిరాజ్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ నాయకుడు పంజా భిక్షపతి ప్రతి నిత్యం ప్రజలలో ఉంటూ గ్రామంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అకాల వర్షాలతో విద్యుత్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద చెట్ల పొదలు ఎక్కువై వర్షంతో విద్యుత్ ప్రమాదం జరిగే ఆస్కార ం ఉండడంతో వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చి దగ్గరుంచి చెట్ల పొదలను శుభ్రం చేయించారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తాను స్పందించి ఇబ్బందులను తొలగిస్తానని ఆయన పేర్కొన్నారు.

హొరా హొరిగా కుస్తీ పోటీలు



నవతెలంగాణ-టేక్మాల్

దుర్గమ్మ పోచమ్మ ఉత్సవాలు గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్నాయి. చివరి రోజు శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి, కర్ణాటక మహారాష్ట్ర నుంచి మల్లయోధులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కుస్తీ పోటీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసు సిబ్బంది. గ్రామ పంచాయతీ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాకేష్ ప్రత్యేక నిధులతో ఉత్సవాలను నిర్వహించడం అభినందించదగ్గ విషయం. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నెంబర్ రమేష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప తదితరులు ఉన్నారు


బీఆర్ఎస్ నాయకుకుని ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-నిజాంపేట

బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి వెళతారనే సమాచారం మేరకు ముందస్తుగా స్థానిక పోలీసులు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి రంజిత్ గౌడ్‌ని శనివారం అరెస్టు చేశారు. సాయంత్రం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కట్ట ఏసు (30) పశువులను మెపుతూ జీవితం గడుపుతున్నాడు. ఈ నెల 20న పశువులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. పశువులు వచ్చిన ఏసు తిరిగి రాలేదు. చుట్టూ పక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. శనివారం పాత చెరువు వద్ద ఏసు దుస్తులు, చెప్పులు కనిపించడంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. స్నానానికి వెళ్లిన ఏసు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నరేంద్రనాథ్ గౌడ్



నవతెలంగాణ-పాపన్నపేట

బీహార్‌లో ఈ నెల 27 నుండి 30 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బాయ్స్ కబడ్డీ పోటీలకు మెదక్ జిల్లా నుంచి నరేంద్రనాథ్ గౌడ్ ఎంపికైనట్లు మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ రమేష్‌లు వెల్లడించారు. వికారాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు నరేంద్రనాథ్ ఎంపికై జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు వారు వివరించారు. నరేంద్రనాథ్ జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల కబడి అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన



- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడంతో పర్యావరణానికి హాని
- ఎంపీడీవో కృష్ణమూర్తి



నవతెలంగాణ-మనోహరాబాద్

ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంలో ఆచరణాత్మక ప్రయోజనాలను పంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఐటిసి సునేత్రా కల్ వాష్-ఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి గ్రామపంచాయతీ సెక్రటరీలు, ఎంపీడబ్ల్యు వర్కర్లు మొదలగు వారికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంలో ఆచరణాత్మక ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా పంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు ఈ పద్ధతుల గురించి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడంలో కీలకమైన పాత్ర పోషించాలన్నారు. అక్రమ, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం, కాల్చడం ద్వారా పర్యావరణాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే దీని ద్వారా గాలి, నీరు, నేల కలుషితం అవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ వాష్ స్వచ్ఛంద సంస్థ యొక్క ప్రతినిధులు ఐటిసి వాష్-ఐ ప్రాజెక్ట్ ఆఫీసర్ బాలకృష్ణ ఏపీవో బి.జనార్దన్, కమ్యూనిటీ మొబిలైజర్ ఆర్.మల్లేష్, హైజిన్ ఎడ్యుకేటర్ ఎం.మహేష్‌తో పాటు గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఎంపీడబ్ల్యు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో తైబజార్ దక్కించుకున్నచంద్రం సుభాష్ గౌడ్



నవతెలంగాణ-కౌడిపల్లి

వేలం పాటలో తై బజార్‌ను చంద్రం సుభాష్ గౌడ్ దక్కించుకున్నాడు. శనివారం స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో 2025-26కు సంబంధించిన తై బజార్ వేలంపాటలు నిర్వహించారు. ఆరుగురు డిపాజిట్లు పెట్టి వేలంపా టలో పాల్గొన్నారు. ఈ వేలం పాటలో ఆరు లక్షల పదివేలకు చంద్రం సుభాష్ గౌడ్ అత్యధికంగా పాట పాడి తై బజార్‌ను కైవసం చేసుకున్నారని స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువగా తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాడిన పాటలో వారం రోజులలో సగం డబ్బులు ఇవ్వాలని, మిగతా డబ్బుల కోసం బ్యాంకు సేవింగ్ ఖాతా చెక్కును ఇవ్వాలని తెలిపారు. సరైన సమయంలో డబ్బులు ఇవ్వకపోతే ఎవరైతే రెండో పాట దారుడు ఉంటారో వారికి ఎలాంటి షరతులు లేకుండా తైబాదారును ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కరిముల్లా పంచాయత్ కార్యదర్శి వెంకటేష్, కారోపర్ ఎల్లం గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారంలో లేకున్నా ప్రజా సేవలోనే

- సర్పంచ్ పదవి అయిపోయినా సేవా కార్యక్రమాలు
- అడిగిందే తడువుగా సేవా కార్యక్రమాలు
- త్రాగు నీటికి అధిక ప్రాధాన్యతనిస్తున్న నాయకుడు
- యువత కోసం అనేక కార్యక్రమాలు
- ఇప్పటికి ఎవరైనా పనుల కోసం వస్తే వెంటనే ఏర్పాట్లు








నవతెలంగాణ-మనోహరాబాద్

ప్రజా సేవ చేయడానికి అధికారమే కావాలా, అధికారంలో లేకున్నా ప్రజా సేవ చేసి ప్రజల మన్ననలు పొందుతున్న నాయకుడు పంజా భిక్షపతి. సర్పంచ్ పదవిలో తన తల్లి ఉన్నా వృద్ధాప్యం కారణంగా తానే దగ్గరుండి ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను చేపడుతూ ప్రజల నుంచి మంచి పేరును సంపాదించుకున్నాడు. గత ఐదు సంవత్సరాలు సర్పంచ్ పదవిలో ఉండగా అనేక సంక్షేమ పథకాలను చేపట్టి తానే అన్ని కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా సర్పంచ్‌గా ఉన్న కాలంలోనే ఉదయాన్నే గ్రామంలో తిరుగుతూ ఎవరికి ఏం పనులు కావాలో దగ్గరుండి తెలుసుకుని మరి తీర్చడమే కాకుండా ప్రతి నిత్యం గ్రామంలో తానొక్కడే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేవాడు.



సర్పంచ్ పదవి కాలం ముగిసినా..

సర్పంచ్ పదవి కాలపరిమితి తీరిపోయిన తరువాత కూడా ఇంట్లో కూర్చోకుండా ప్రజల మద్యే ఉంటూ వారి కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ వారికి అవసరమైన పనులను చేసిపెడుతున్నాడు. తనకు పదవే లేదు పనులు ఎందుకు చేయాలనే ఆలోచన లేకుండా గ్రామంలో ఏ పనులు కావాలన్నా ఇంకా అధికారులు కానీ ప్రజలు కానీ అతననినే అడుగుతున్నారు. సర్పంచ్ పదవులు అయిపోయిన తరువాత ప్రభుత్వం గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ పాలనను కొనసాగిస్తుంది. దాంతో గ్రామాలలో స్వచ్ఛత పూర్తిగా పడకేసింది. అయినప్పటికి కార్యదర్శి పంచాయతీ పనులకు మళ్లి అతనినే ముందుకు తీసుకెలుతూ పనులను చేపట్టాలని కోరే పరిస్థితి నెలకొంది. అయినప్పటికి గ్రామంలో స్వచ్ఛత కోసం తానే ముందుంటాననే ఆలోచనతో పనులను చేపడుతూ ప్రజల నుంచి ప్రశంసలను పొందుతున్నారు.

నిధులు మంజూరు చేయకపోయినా అభివృద్ధి పనులు

మనోహరాబాద్ నుంచి దండుపల్లి గ్రామపంచాయతీగా ఏర్పడింది. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ కావడంతో ఆ గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రజలంతా కలిసి పంజా లక్ష్మిని ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఏకగ్రీవం జరిగిన గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా పది లక్షల రూపాలయలు ఇస్తున్నట్టు ప్రకటించినప్పటికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదు. దాని కోసం ఎదురుచూడకుండా సర్పంచ్‌గా ఎంపికైన పంజా లక్ష్మి గ్రామంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టింది. సర్పంచ్ వృద్దురాలు కావడంతో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొన్నప్పటికి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి మాత్రం తన కొడుకు పంజా భిక్షపతి ముందుండి పనులను చేపట్టారు.

పారిశుధ్యంలో ఆదర్శంగా నిలిచిన పంచాయతీ

గడిచిన ఐదు సంవత్సరాలు ప్రతి నిత్యం ప్రజల మద్యే ఉండి సంక్షేమ పనులను కొనసాగించారు. పంజా భిక్షపతికి ప్రజా సేవ చేయాలనే లక్ష్యం కాగా ఆయన లక్ష్యానికి తగినట్టు ప్రతి నిత్యం ప్రజలకు సేవా కార్యక్రమాలను చేపట్టేవాడు. ఆయన పదవిలోనే గ్రామంలో అనేక కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని పారిశుద్యంలో కానీ అభివృద్దిలోకాని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్ది ఇటు ప్రజలతో, అటు అధికారుల తో మంచి పేరును సంపాదించుకున్నారు. అధికారంలో ఉండగా సుమారు లక్షల రూపాయలను తన స్వంత డబ్బును వెచ్చించి పనులు చేపట్టారు ప్రభుత్వం నుంచి ఇంకా ఎనిమిది లక్షల వరకు డబ్బులు రావాల్సి ఉంది. అలా అని సంక్షేమ పనులను మాత్రం చేపట్టకుండా ఉండలేకున్నారు. సర్పంచ్ పదవి అయిపోయి సంవత్సర కాలం గడుస్తున్నా ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నాడు

స్వంత నిధులతో అభివృద్ధి పనులు

పంజా భిక్షపతి. గ్రామంలోని వాటర్ ట్యాంకు నీరు ట్యాంకు వాల్ చెడిపోయి నీరు వృధాగా పోతుందని కార్యదర్శి చెప్పడంతో నాకెందుకులే అనుకోకుండా లక్షల రూపాయలు పెట్టి వాల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పిట్టల వాడలో త్రాగు నీటికి ఇబ్బందులు ఉండడంతో అక్కడి ప్రజలు పంజా భిక్షపతి వద్దకు రావడంతో వెంటనే నూతన బోర్ మోటార్‌ను కొని తానే దగ్గరుండి మరీ మోటార్‌ను బిగించి వారి త్రాగు నీటి సమస్యను తీర్చారు. అలాగే గ్రామంలో కూడా అంబేద్కర్ వెనకాల కూడా బోర్ మోటార్‌ను తన స్వంత డబ్బుతో ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో ఏ చిన్న పనులు ఉన్నా తానే దగ్గరుండి చేపట్టి ప్రజల అవసరాలను తీరుస్తున్నారు. గ్రామంలోని యువత కోసం క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వారికి ఇంకా అనేక రకాల దేహదారుఢ్యం కోసం పరికరాలను ఐటీసి సహకారంతో ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కార్యక్రమాలు ఉన్నాయి. సర్పంచ్ పదవి ఉన్నపుడే గ్రామాభివృద్దిని నిర్లక్ష్యం చేసే ఈ తరుణంలో సర్పంచ్ పదవి లేకున్నా ఇంకా ప్రజల మద్యే ఉంటూ సంక్షేమం కోసం పాటు పడుతూ ప్రజల మన్ననలు పొందుతూ వారికి ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజల నుంచి ప్రశంసనలను అందుకుంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు
- ముందస్తు అరెస్టును నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం





నవతెలంగాణ-నర్సాపూర్

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయమంటే, అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మండి పడ్డారు. శనివారం అరెస్టులను నిరసిస్తూ నర్సాపూర్ బస్టాండు వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ అసంఘటిత రంగా కార్మికులు లేనిది ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచడం కోసం రెక్కలు, ముక్కలు చేసుకుని కష్టపడుతున్న రవాణా రంగ కార్మికులు, హమాలి కార్మికులకు ఎటువంటి సంక్షేమ బోర్డు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మూలంగా ఆటో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు సీఐటీయూ ఉపాధ్యక్షుడు కడారి నాగరాజును శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు.

గజ్వేల్ పోరుబాట పాదయాత్రలో మనోహరాబాద్ నాయకులు


- గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజల్లోకి రావాలి
- ఉమ్మడి మండలా పీఏసిఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి



నవతెలంగాణ-మనోహరాబాద్

గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రజలలోకి రాని ఎమ్మెల్యే కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే హక్కులేదని ప్రజల ఓట్లతో గెలిచిన నాయకుడు ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారని అలాగే ఆయనను ఫాంహౌజ్‌లోనే ఉండాలని ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెలేగా గెలిచి ఇప్పటి వరకు ప్రజల మద్యకు రాని కేసీఆర్ ను ఆపదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చేపట్టిన సిద్దిపేట కలెక్టరేట్ నుంచి గవర్నర్ కార్యాలయం వరకు చేపట్టిన గజ్వేల్ పోరుబాట పాదయాత్ర కార్యక్రమానికి మనోహరాబాద్ నుంచి ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు తరలివెల్లారు. పాదయాత్ర మూడవ రోజున పాల్గొన్న చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ బద్దంగా ప్రజల ఓట్లతో గెలిచిన కేసీఆర్ ఇప్పటి వరకు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కార కోసం కనీసం అసెంబ్లీ సమావేశాలకు కూడా హజరు కానీ ఎమ్మెలను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో గెలిచి ఏ ఒక్క రోజుకూడా ప్రజల సమస్యలు తెలుసుకోని కేసీఆర్ ఆస్థానం నుంచి ఆయనే తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మరో నాయకుడికి ఆ స్థానం అప్పగించాలని ఆయన అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పది సంవత్సరాలు కొనసాగిన నాయకుడు కేసీఆర్‌కు ఆ రాజ్యాంగంపై ఎంత విలువ ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్, తూప్రాన్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-నార్సింగి

అసెంబ్లీ ముట్టడికి బయలుదేరకుండా స్థానిక ఎస్సై అహ్మద్ మోహిఉద్దీన్ బీ.ఆర్.ఎస్.వీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భూపతి రాజు, జోగు జీవన్ కుమార్‌లను ఎస్సై అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీ.ఆర్.ఎస్.వి విభాగం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం పోరాటం చేసే వారిని అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఉద్యమాలు, అరెస్టులు తమకు కొత్త కాదని, పోరాడి సాధించుకున్న తెలంగాణను రాష్ట్ర యువతను ఆగం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై దృష్టి పెట్టకుండా పరిపాలనపై దృష్టి సారించాలని, ఎన్నికలలో రాష్ట్ర యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మండిపడ్డారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్ తూర్తి గ్రామంలో వ్యవసాయ పొలాలను శనివారం వ్యవసాయ మండలాధికారి దీపిక సందర్శించారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వరి ఎండిపోకుండా పలు సూచనలు చేశారు. నీటి ఎద్దడి ఉన్న పొలాలలో బోరు బావిలో ఉన్న నీటికి అనుకూలంగా సరిపడే నీరు అందించి వరిని కాపాడుకోవాలని సూచించారు. అందులో భాగంగా వరికి అవసరమైన మేరకు మాత్రమే నీరు అందించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు తేజస్విని, రవివర్మ రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం



నవతెలంగాణ-నిజాంపేట్

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని నస్కల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో నీటి వినియోగం గురించి విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన ఉపన్యాస పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రతినిధులు మాట్లాడుతూ బాలవికాస సంస్థ ద్వారా గ్రామంలో గత 12 సంవత్సరాలుగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరును అందిస్తున్నామన్నారు. జలమే జగతికిమూలఆధారమని, జలమే ప్రగతికి ప్రణాధారం, జలమే మనకు ఆహారం, జలమే మనకు ఆరోగ్యం, జలాన్ని మనం రక్షిస్తే జలం మనం రక్షిస్తుందని హితవు పలికారు. నీరు కలుషితం కాకుండా నీటి స్వచ్ఛతను పెంచాలని తెలిపారు. నీటిని పొదుపుగా వాడాలన్నారు. ఇందుకు యువత ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గయ్య ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, లలిత, సురేందర్, బాలవికాస సూపర్వైజర్ పరుశురాం, జోనల్ డైరెక్టర్ జీడి తిరుపతి గౌడ్, దుబాసి సంజీవ్, పాగాల ఎల్లం యాదవ్, బాలవికాస కమిటీ సభ్యులు మెట్టు వెంకట్, పోలు శ్రీనివాస్, దేవరాజు, నరేష్, పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్



నవతెలంగాణ-మనోహరాబాద్

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కార్మికులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగుతూనే ఉం టాయని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొ న్నారు. అసంఘటిత రంగ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెలుతున్న కార్మిక సంఘం నాయకులు ఆసిఫ్‌ను మనోహరాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పారిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్మక్రమాన్ని ప్రభుత్వ అనుమతులతో చేపడుతున్నప్పటికి ప్రభుత్వం కార్మిక నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. చలో హైదరా బాద్ కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలు నిరణయం తీసుకుని చేపడుతున్నాయని అలాంటి కార్యక్రమాన్ని భగ్నం చేయడం ప్రభుత్వానికి తగదని ఆయన అన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులు పునరావృతం కాకుండా కార్మికులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు.

ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఒక వరం


- పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్‌పాషా



నవతెలంగాణ-మనోహరాబాద్

మెరుగైె చికిత్సల కోసం కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రతి నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరంలాటిదని పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్‌పాషా పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన ర్యాకల ఝాన్సికి రూ.34 వేలు, వంగాల అభిలాష్‌రెడ్డి రూ.50 వేలు మంజూరు కాగా లబ్ధిదారులకు చెక్కులను శనివారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిట్కుల్ వెంకట్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరు సీఎంఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహర్నిశలు పేదల సంక్షేమం కోసం పాటుపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, నవీన్ పంతులు, కృష్ణారెడ్డి, సన్ని, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య.



నవతెలంగాణ-పాపన్నపేట

ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఊట్ల భువనేశ్వరి (33) గత కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. అదే విషయమై తరచూ ఇంట్లో బాధపడుతుండేది. శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాసేపటికి ఇంట్లోకి వచ్చిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్సులో భువనేశ్వరిని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సీ డీడీ కవితపై చర్యలు తీసుకోవాలి



-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేట

అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎస్సీ డిడి కవితపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్ లో ఔట్ సోర్సింగ్ జాబులు ఇప్పిస్తూ సుమారుగా రూ.60 నుంచి రూ.70 వేలు తీసుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా హైదరాబాదులో కవిత నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ పనులకి సిద్ధిపేట జిల్లాలో ఉన్న హాస్టల్ వర్కర్స్‌లని పనులకి ఉపయోగించుకుంటున్నారని అన్నారు. హాస్టల్స్‌లలో కూరగాయలు, గుడ్లు, మాంసం తన వెంట తీసుకువెళ్లేదని, వార్డెన్ లకు బిల్స్ చేయాలంటే పర్సంటేజ్ తీస్కుంటున్నదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కవితపై విచారణ జరిపించాలని కోరారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు తీసుకుంటుందని తెలిపారు. వీటిపై విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ కుమార్, కోనేరు ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చెప్పాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ రిబ్బన్ క్లబ్ ద్వారా అవగాహన సదస్సు



నవతెలంగాణ-గజ్వేల్

శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ నందు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోస్టర్ ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమలా క్రిస్టియాన రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ పి.శ్రీలత, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ మహాలక్ష్మి, టిఎస్ కేసి కోఆర్డినేటర్ డాక్టర్ జె ఉమారాణి, డాక్టర్ ఆర్ సునీత, డాక్టర్ పి.జ్యోతి, ఎస్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యువవికాసంలో ఈడబ్ల్యూఎస్‌కు అవకాశం పట్ల హర్షం



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు ఈడబ్ల్యూఎస్ ద్వారా రెడ్డి నిరుపేదలకు అవకాశం కల్పించడం అభినందనీయమని శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ ద్వార రెడ్డి నిరుపేదలకు అవకాశం కల్పించేల కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన రత్నాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వినికిడి లోపం ఉన్న బాలుడికి ఎల్‌ఓసీ అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన మంతెన బాల్ రెడ్డి, మనుమడు నిమ్మ మన్విత్, వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. మన్విత్‌కు వినికిడి యంత్రాన్ని వాడితే అతనికి వినబడుతుందని డాక్టర్లు చెప్పారు. వినికిడి యంత్రానికి సుమారు రూ.7 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, దృష్టికి బాల్ రెడ్డి, మన్విత్, సమస్యను తీసుకెళ్లడంతో కృష్ణారెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మన్విత్ కు వినికిడి యంత్రానికి ప్రభుత్వం నుంచి రూ.7 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయడంతో కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే సహకరించిన మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు

కారు, బైకు యాత్ర చేస్తున్న నర్సారెడ్డి

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



కారు, బైకు యాత్ర గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి చేస్తున్నారని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాని నర్సారెడ్డి ప్రజల కోసం పాదయాత్ర చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతోనే మూడుసార్లు ఓట్లు వేసి రెండుసార్లు ముఖ్యమంత్రి చేసి ఒకసారి ప్రతిపక్ష నేత దేశంలో గుర్తింపు వచ్చిందన్నారు. పాదయాత్ర పదవులు కాపాడుకునేందుకు మాత్రమే పనికొస్తుందని విమర్శించారు. నర్సారెడ్డి ఎమ్మెల్యే ఉన్నప్పుడు కబ్జాలు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసి డబ్బులు దండుకున్న చరిత్ర ఉందని విమర్శించారు. పాదయాత్రలు మానుకొని ఎండిపోతున్న పంట పొలాలు చూసి నీటిని ఇప్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి చాంబర్ వరకు మోకాలు యాత్ర చేయాలని ఆయన సూచించారు.

పిడుగు పాటుతో పాడిగేదె మృత్యువాత


నవతెలంగాణ-మద్దూరు



చేర్యాల మండలంలోని కమలాయపల్లి, గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపాటుతో పాడి గేదే మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన రైతు చెన్న యాదగిరికి చెందిన పాడి గేదె పిడుగుపాటుతో మృత్యువాత పడడంతో ఆ రైతుకు రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. పాడి గేదెను కోల్పోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఎస్పీ నాయకులు


నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో ఎండిన వరి పంట పొలాలను శనివారం బీఎస్పీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతు కంసాని అశోక్ నీరు లేక వరి పంట పూర్తిగా ఎండిపోయిందన్నారు. రైతుల పంటలకు సంబంధించి పంటల వ్యక్తిగత భీమా ప్రీమియంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విధానాన్ని తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు వెలుపల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, బిఎస్పి నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.18 వేల మైక్ సెట్ విరాళం

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి రూ.18 వేల మైక్ సెట్‌ను శనివారం గ్రామానికి చెందిన చిలువేరు రాములు యాదవ్ అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మార్క అనిల్ గౌడ్ తెలిపారు.

పదవులు, పైసల కోసం పార్టీ మారిన ప్రతాప్

-మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



పదవులు, పైసల కోసం పార్టీ మారిన ప్రతాప్ రెడ్డి నైజం అందరికి తెలిసిందేనని మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, కొండపాక కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాదయాత్రపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ఆరోపణలు విడ్డూరమని అన్నారు. నర్సారెడ్డి కారు, బైకులపై పాదయాత్ర చేస్తున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. రాజకీయ పబ్బం కోసం ప్రతాప్ రెడ్డి పార్టీలు మారుస్తున్నారని ఆపైగా నిజాయితీగా ఉన్న నర్సారెడ్డి పై విమర్శలు చేయడం సిగ్గు చేటు అన్నారు.

పొదుపు చేస్తేనే భావితరాలకు నీరు :కనకరాజు


నవతెలంగాణ-దుబ్బాక



ప్రతీ నీటి బొట్టును వృధా చేయకుండా పొదుపు చేస్తేనే భావితరాలకు నీరును అందించగలుగుతామని బాలవికాస జిల్లా కోఆర్డినేటర్ కాంతుల కనకరాజు చెప్పారు. నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 'వాక్ ఫర్ వాటర్' అన్న కార్యక్రమంలో భాగంగా శనివారం దుబ్బాక మండలం హబ్సిపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నీటి ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పిస్తూ మానవహారం, ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాలవికాస గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేష్, కమిటీ సభ్యులు శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్: ఆస రాజశేఖర్

నవతెలంగాణ-దుబ్బాక



రాష్ట్రంలో ప్రభుత్వమేర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమని బీఆర్ఎస్వీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు ఆస రాజశేఖర్ అన్నారు. బడ్జెట్‌లో ఈ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందన్నారు. బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను దుబ్బాక పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో బీఆర్ఎస్వీ సోషల్ మీడియా నాయకులు ముచ్చర్ల అఖిల్, బట్టు లక్ష్మణ్, పర్స స్వామి, హార్ట్ వర్కర్ పండు, పాతూరి చందురెడ్డి, కేపీఆర్ సేన అధ్యక్షులు బాల్ రెడ్డి ఉన్నారు.

ఆకాల వర్షం..అన్నదాతకు అపార నష్టం

- నేలరాలిన వరిధాన్యం.. నేలకొరిగిన మొక్కజొన్న
- శుక్రవారం సాయంత్రం ఈదురుగాళ్లతో కూడిన భారీ వర్షం
- ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట నేలపాలు
- అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్







నవతెలంగాణ-బెజ్జంకి, సిద్ధిపేట, గజ్వేల్, రాయపోల్

ఆకాలంగా కురిసిన వర్షం వల్ల మండలంలో ఆరుగాలం కష్టపడిన అన్నదాతలు అపార నష్టం కల్గి ఆగమాగమయ్యారు. శుక్రవారం కురిసిన ఆకాల వర్షం గాలి భీభత్సం సృష్టించింది. వడగండ్లు కురియడంతో కోతకు వచ్చిన వరి పైరుల్లో వరిధాన్యం నేలరాలాయి. మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఆకాల వర్షం వల్ల నేలరాలిన వరి, నేలకొరిగిన మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి ప్రభుత్వం పరిహారం అందించేల కృషి చేయాలని అయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేశారు.

33.3 శాతం నష్టంవాటిల్లితే పరిగణనలోకి..

ఆకాలంగా కురిసిన వర్షాల వల్ల నేలరాలిన వరిధాన్యం, నేలకొరిగిన మొక్కజొన్న సుమారు 33.3 శాతం నష్టం వాటిల్లితే పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని శనివారం ఏఈఓలు తెలిపారు. ఏఓ ఆధేశానుసారం అయా క్లస్టర్ గ్రామాల్లో ఏఈఓలు వరిధాన్యం, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించనున్నట్లు ఏఈఓలు తెలిపారు.

సిద్ధిపేటలో ఈదురు గాలులకు వంగిన స్తంభాలు

శుక్రవారం సాయంత్రం ఈదురుగాలితో కురిసిన వర్షానికి సిద్ధిపేటలోని కొన్ని ప్రాంతాలలో చెట్లు పడిపోగా, కొన్ని స్తంభాలు వంగిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు రాత్రి వాటిని సరి చేశారు. మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు, కందులు షెడ్ల కింద ఉండడంతో ధాన్యానికి ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

వర్షాలకు పడిపోయిన పంటలు

వరి, మొక్కజొన్న ఇతర పంటలు శుక్రవారం రాత్రి కురిసిన వర్షాల వలన పూర్తిగా వంగిపోయాయి. గజ్వేల్, రాయపోల్, దౌల్తాబాద్, వర్గల్, ములుగు, జగదేవపూర్ కొండపాక మండలాల్లో విపరీతంగా గాలులు వీస్తున్నాయి. శుక్రవారం లాగే శనివారం అదే పరిస్థితి ఉంది. రాయపోల్ మండలం రామారం, వడ్డేపల్లి, అంకిరెడ్డిపల్లి, రామ్ సాగర్ గ్రామాల్లో స్వల్పక వరి పొలాలు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. గజ్వేల్ మండలంలో చాలా గ్రామాల్లో మొక్కజొన్న ఇతర పంటలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నం ఉపయోగ పడటం లేదు. శుక్రవారం కురిసిన వర్షం కొంత ఊపిరి పోషే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

రాయపోల్‌లో.. శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలతో కూడిన భారీ వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతన్నకు ప్రకృతి విధించిన శాపంతో విలవిలలాడ ుతున్నాడు. రాయపోల్, దౌల్తాబాద్ మండలాలలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో భారీ వర్షం తీవ్ర పంట నష్టం కలిగించింది. దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా తిరుమలాపూర్, మహమ్మద్ షాపూర్, అహ్మద్ నగర్, ముబారస్ పూర్, దొమ్మాట తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, పొద్దుతిరుగుడు పంటలు నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 125 ఎకరాల మొక్కజొన్న, 10 ఎకరాల వరి, 5 ఎకరాల పొద్దు తిరుగుడు పంటలు ఈదురు గాలులకు నేలకొరిగాయి. రాయపోల్ మండలంలోని రాయపోల్, కొత్తపల్లి, టెంకంపేట, తిమ్మక్ పల్లి పలు గ్రామాల్లో వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. రాయపోల్ మండల వ్యాప్తంగా 35 ఎకరాల మొక్కజొన్న పంట, నేలకొరకగా 2 ఎకరాల పొద్దుతిరుగుడు, మరికొంత వరి పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయ అధికారులు ధ్రువీకరించారు. ప్రకృతి వల్ల నష్టం వాటిలినందుకు ప్రభుత్వం ఆదుకోవాలని లేనియెడల రైతన్నలు అప్పులపాలు అయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరుణాలేని వర్షం తీవ్ర నష్టం కలిగించింది



యాసంగి కాలంలో మాకు ఉన్న వ్యవసాయ పొలంలో రెండు ఎకరాలు మొక్కజొన్న పంట సాగు చేయగా శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పంట మొత్తం నేలకొరిగింది. నిన్న మొన్నటి వరకు తీవ్రమైన ఎండలతో పంటలను కాపాడుకోవడానికి నీటి కోసం ఎన్నో అవస్థలు పడగా, ఇప్పుడు భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో అకాల వర్షాలతో పంట నష్టం జరగడం రైతులకు కోలుకోలేని దెబ్బ కాబట్టి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని అన్నారు.

-రైతు నరసింహారెడ్డి మహమ్మద్ షాపూర్

పంట నష్టాల తీవ్రతను ప్రభుత్వానికి నివేదిక పంపించాం



శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి మొక్కజొన్న వారి పొద్దుదీరుడు పంటలు నేలకురుగాయని కొన్ని పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను ప్రాథమిక సర్వే చేసి జిల్లా అధికారులకు పంపించడం జరిగిందన్నారు తదుపరి ప్రభుత్వం తీసుకుని నిర్ణయాన్ని బట్టి చర్యలు చేపడతామన్నారు

-రాయపోల్ మండల వ్యవసాయ అధికారి రాసాల నరేష్

సీపీఐ శత జయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



నవతెలంగాణ-చేర్యాల

సీపీఐ శతజయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామంలో శనివారం సీపీఐ, ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అక్రమ కేసులు, జైలు నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్ర సాధన ఉద్యమంలో జాతీయస్థాయిలో ఒకే మాట ఒకే బాట అనే నినాదంతో రాష్ట్రం సాధించేంతవరకు పోరాడిందని గుర్తు చేశారు. వారోత్సవాల సభ సందర్భంగా ఈనెల 25న గాంధీ చౌరస్తా నుంచి అంగడి బజారు వరకు ర్యాలీ, షాదిఖానలో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ సిద్ధిపేట, జనగామ జిల్లాల కార్యదర్శులు మంద పవన్, సీహెచ్ రాజారెడ్డి లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య, పొన్నబోయిన మహేందర్, దండబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ కొరడా

- టిప్పర్, జేసీబీలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని దామరకుంట గ్రామ శివారులో ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్‌లో నింపుకొని అక్రమ వ్యాపారం చేస్తున్న గంగాన శ్రీనివాస్ గ్రామం బంగ్లా వెంకటాపూర్, మమ్మద్ ఇద్దు (జేసీబీ డ్రైవర్) ఇద్దరూ నిందితులను, టిప్పర్, జేసీబీలను శుక్రవారం రాత్రి సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన, నిల్వ ఉంచిన, మట్టి తవ్వి అక్రమ రవాణా చేసిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల 38712667445, 871266 7446, 8712667447 సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతున్నారు.

సమగ్ర మత్స్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సిద్ధిపేట అనుకూలం

- తెలంగాణ ఫిషరీస్ సోసైటి మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్



నవతెలంగాణ-సిద్ధిపేట

భారత ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న సమగ్ర మత్స్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సిద్ధిపేట అనుకూలంగా ఉంటుందని తెలంగాణ ఫిషరీస్ సోసైటి మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మాట్లాడుతూ దేశంలో ఐదు సమగ్ర మత్స్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సిద్ధిపేట జిల్లా 60 కిలోమీటర్ల పరిధిలో 12 రిజర్వాయర్లు ఉన్నాయని, సుమారు 133 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యాన్ని కలిగిఉన్న ఈ జలాశయాల నుంచి ఏడాదికి కనీసం 50వేల టన్నుల చేపలను ఉత్పత్తి చేసేందుకు అవకాశాలున్నాయన్నారు. జిల్లాలో నాలుగు మధ్యతరహా నీటివనరులు, 1412 గ్రామపంచాయతీ చెరువులు, మత్స్యశాఖకు సంబంధించిన 234 పెద్ద చెరువులు అందుబా టులో ఉన్నాయని, వీటినుండి ప్రతియేటా అదనంగా మరో 2వేల టన్నుల చేపలను ఉత్పత్తి చేసేందుకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. సమగ్ర మత్స్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటయితే అదనంగా పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, రెండు లక్షల టన్నుల చాపల ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం 500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు కోసం స్థానిక పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు ప్రత్యేకంగా కృషిచేసి, జిల్లాలో మత్స్యరంగం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తుపాకుల బాల్ రంగం పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కొండపాక

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 25న చలో హైదరాబాద్ పోవుటకు అనుమతి కోరుతూ డీపీఓ ఆఫీస్‌లో తమ డిమాండ్లతో కూడిన అనుమతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నరసయ్య మాట్లాడుతూ...జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు మూడు నెలల నుంచి ఏడు నెలల వరకు పెండింగ్ ఉండడంతో కార్మికుల కుటుంబాలు అప్పులు చేసి కుటుంబాన్ని పోషించవలసి వస్తుందన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వం కార్మికులందరికీ జనవరి 2025 నుంచి ఒకటవ తారీఖు నుండి 5వ తారీఖు వరకు కార్మికుల అకౌంట్లలో వేతనాలు వేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల వాహన సంస్కరణలకు రూ.20వేలు ఇవ్వాలని ఆన్లైన్లో నమోదు కానీ కార్మికుల పేర్లను నమోదు చేయాలన్నారు.మార్చి 25న హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతుందని హైదరాబాదులో జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య నాయకులు గొడుగు నారాయణ, కొమ్ము నర్సింలు, కనకయ్య రవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్



నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్రంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి శనివారం ఎలాంటి పిలుపు ఇవ్వకున్న ముందస్తుగా ఏఐఎస్ఎఫ్ నాయకులను రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ సిద్ధిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ తెలిపారు. ఏలాంటి పిలుపు లేనప్పుడు సమాచార లోపంతో తనతోపాటు మండల కార్యదర్శి ఎస్కే యాసిన్, జిల్లా నాయకులు గిరిక అభినయ్‌లను అక్రమ అరెస్టులు చేయడం చాలా దుర్మార్గమని దీనివల్ల వ్యక్తుల వ్యక్తిగత పనులు, సంఘ కార్యక్రమాలు, అడ్డుకున్నట్లే అవుతుందని, ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంగనేనని అన్నారు. ప్రభుత్వం భయంతో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం సబబు కాదని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించి ప్రయివేట్ కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తుందని, శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలకు ఎలాంటి అనుమతులు లేకుండా ముందస్తు అడ్మిషన్లు చేస్తు న్న వాటిని పట్టించుకోవడంలేదని ఇలాంటి చర్యలను ప్రశ్నిస్తున్నందుకే ఏఐఎస్ఎఫ్ నాయకులను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టులు చేస్తుందన్నారు. ఇదేవిధంగా అరెస్టుల పర్వం కొనసాగిస్తే గత ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో భవిష్యత్తులో మీకు అదే గతి పడుతుందని హెచ్చరించారు. అరెస్టు చేసిన నాయకులను బెషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి






నవతెలంగాణ-చేర్యాల : ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించి వెంటనే బకాయి వేతనాలు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, భూమిలేని నిరుపేద ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.12వేల చొప్పున ఆత్మీయ భరోసా వెంటనే మంజూరు చేసి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గౌరె శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, అధ్యక్షులు గుంద్ర రవీందర్ సంఘం కార్యకర్తలు మల్కనీ ఎల్లయ్య, జీడాల చంద్రయ్య, పొన్నమైన సిద్దులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి: గత 6 వారాలుగా ఉపాధి కూలీలకు నిలిచిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి అందజేయాలని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓకు వినతిపత్రమందజేశారు. మండలంలోని అయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో పనిచేస్తున్న కూలీలకు సుమారు రూ.20 లక్షలు బకాయిలు పెరుకుపోయాయని, రెక్కాడితే గాని డొక్కాడని కూలీలకు ఉపాది కూలీ అందించకపోవడం సరైందికాదని ప్రభుత్వం త్వరితగతిన ఉపాధి బకాయిలు విడుదల చేసి అందజేసేల కృషి చేయాలని ఎంపీడీఓను సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగెం మధు, పట్నం అంజి, రొడ్డ లక్ష్మణ్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-కొండపాక

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాల నరసయ్య అన్నారు. శనివారం అక్రమ అరెస్టులను ఖండిస్తూ కొండపాక మండలం దుద్దెడ గ్రామ అంబేద్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్‌తో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేము పాలకులం కాదు, సేవకులమని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయమంటే అసంఘటితరంగా కార్మికుల సమస్యలు పరిష్కారం చేయమంటే శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో దిగ్బంధించడం ఏంటని ప్రశ్నించారు. మాది ప్రజా ప్రభుత్వమని ప్రగాల్భాల్ చెప్పడం కాదు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడలను వ్యతిరేకించాలని కోరారు. శాంతియుత ధర్నాకు వెళు తున్న కార్మికులను అరెస్టులు చేయడం చాలా దారుణమన్నారు. హమాలీ వర్కర్స్ పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు ఎలాంటి పని భద్రత లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్న మాదిరిగా సమగ్ర చట్టాన్ని అమలు చేసి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని ఇలాంటి అరెస్టులు చేస్తే భయపడే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ హమాలీ బ్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు బర్మ కొమురయ్య ఎండి నబి బాబా, తటోజు రవీంద్ర చారి, కొమరవెల్లి కనకయ్య రాజయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్

కార్మిక రంగ సమస్యలను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టు చేయడం సరైనది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ శనివారం సిద్ధిపేటలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆయన మాట్లాడారు. ధర్నా కార్యక్రమానికి ప్రభుత్వమే అనుమతి ఇచ్చి జిల్లాలో ధర్నాకు వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల ఇంటి వద్దకు వెళ్లి ఉదయం పూట అరెస్టు చేసిన వారిని సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. అరెస్టులతో పోరాటాలను ఉద్యమాలను ఆపాలనుకోవడం అవివేకమని ప్రభుత్వ వైఖరి ఇట్లే కొనసాగితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చిలపురం అంజయ్య, మల్లేశం, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మండల భాస్కర్, భూపతిరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ స్ఫూర్తి నేటితరం యువతకు ఆదర్శం

-యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి

నవతెలంగాణ-గజ్వేల్

భగత్ సింగ్ స్ఫూర్తి నేటితరం యువతకు ఆదర్శమని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ హబ్ కేంద్రంలో శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కి ఆయన హజరై మాట్లాడుతూ.. దేశ స్వతంత్రం కొరకు ఉరి కంబాన్ని ముద్దాడిన గొప్ప పోరాట యువకిశోరం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ అని వారు అన్నారు. అతి చిన్న వయసులో దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా పెట్టిన షాహిద్ భగత్ సింగ్ యువతకి ఆదర్శం కావాలన్నారు. తక్షణమే భగత్ సింగ్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో విద్యార్థుల యువత సమస్యలపై భగత్ సింగ్ స్ఫూర్తితో సమరసిల పోరాటాలకు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్ డివిజన్ నాయకులు స్వామి, ప్రవీణ్, సందీప్, రంజిత్, కార్తీక్, కర్ణకార్ తదితరులు పాల్గొన్నారు.



నిఘా నీడన మూల్యాంకనం



నవతెలంగాణ-సిద్ధిపేట

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా మూల్యాంకనం చేసి, సిద్ధిపేట మూల్యాంకన కేంద్రం పేరును నిలబెట్టాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. సిద్ధిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో గతంలో కంటే విభిన్న మార్పులు చేశారన్నారు. అన్ని గదిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రతి కదలికను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అధ్యాపకుడు బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉంటుందని, తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఐడి కార్డులు లేకుండా కేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు. నిర్లక్ష్యం చేస్తే లక్షల్లో పెనాల్టీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. చీఫ్ కోడింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏసిఓ జనరల్-1 సత్యనారాయణరెడ్డి, ఏ సి ఓ జనరల్ 2 శ్రీనివాస్, ఏ సి ఓ వ్యాల్యూషన్ గంగాధర్, దేవ స్వామి లు మూల్యాంకన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు.

వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-కొండపాక

చదవడంలో రాయడంలో వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిలో నైపుణ్యాలను పెంపొందించాలని కుకునూరు పల్లి మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని హనుమాన్ నగర్, కోలోనివంపు ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి కావడంతో త్వరలోనే వార్షిక పరీక్షలు జరగనున్నాయని వాటికి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. చదవడం రాయడంలో వెనుకంజలో ఉన్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోజు ప్రాక్టీస్ చేయించాలన్నారు. పిల్లల్లో పరీక్షలు అంటే భయం లేకుండా ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు ప్రాక్టీస్ చేస్తూ అన్ని అంశాలు వచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే ఈ నెల 31లోపు ఎఫ్ఎల్ఎన్ ఎండ్ లైన్ పరీక్షలు పూర్తిచేసి అప్లోడ్ చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు చేయూత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తిమ్మాయి పల్లి గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ముదిరాజ్ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు రావుల రాజు శనివారం పరామర్శించి ఆర్థిక సాయమందజేశారు. పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు పోచయ్య,సంతోష్,శ్రీనివాస్ ఉన్నారు.

తహసిల్దార్‌ను పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-తొగుట

తహసిల్దార్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు యాదవ్, మాజీ ఎంపీటీసీ కంకణాల నరసింహులు పరామర్శించారు. శనివారం స్థానిక తహసీల్దార్ విధులు నిర్వహించిన కే.శ్రీకాంత్ మంగళవారం యశోద ఆసుపత్రిలో యెడమ కాలు ఆపరేషన్ చేయిం చుకున్నారు. డిశ్చార్జ్ అయిన తహసిల్దార్ కరీంనగర్‌లో తన నివాసంలో పరామర్శించారు. త్వరగా కోలుకుని మళ్లీ తొగుటలో విధులు నిర్వహించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

నీటిని నిల్వ చేయడం అందరి బాధ్యత



నవతెలంగాణ-కోహెడ

నీటిని నిల్వ చేయడం అందరి బాధ్యత అంటూ ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని తంగళ్ళపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఛావడి వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నీటి నిల్వ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భావితరాలకు నీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు బాలవికాస ఆధ్వర్యంలో నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జి.యాదమ్మ, మాజీ ఎంపీటీసీ కోనె శేఖర్, బాలవికాస వాటర్ ప్లాంట్ అధ్యక్షుడు వెల్ది రాజేశం, ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలవాలి

-బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకన్న



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ అత్యధిక సీట్లు గెలిచేలా నాయకులు కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకన్న అన్నారు. శనివారం హుస్నాబాద్ బీఎస్పీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికల్లో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అగ్రవర్ణ పేదలకు పార్టీ ఎప్పుడు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఓం ప్రకాష్, జిల్లా ఇన్చార్జ్ దేగల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, సీనియర్ నాయకులు మారిశెట్టి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు 50 శాతం రాయితీపై పనిముట్లు



నవతెలంగాణ-గజ్వేల్

మహిళా రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తామని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి ఎస్ఎంఎస్ పథకం ద్వారా 50 శాతం రాయితీపై మహిళా రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ట్రాక్టర్ ఆర్‌సీ భర్త పేరు మీద ఉన్న తీసుకుంటామన్నారు. మండల యూనిట్గా వీటిని అందజేస్తామని అన్నారు. గజ్వేల్, కొండపాక, కుకునూరు పల్లి మండలాల చెందిన రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 25న అని తెలిపారు. ఇందుకు కావలసింది భూమి పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సీ సంబంధించిన బుక్కు జిరాక్స్ అందించాలన్నారు. అదేవిధంగా డిడి సప్లై కంపెనీ పేరు ఉండాలి అన్నారు.

ఇండియాకు చేరిన అశోక్ మృతదేహం

-సౌదీ అరేబియాలో మృతి చెంది 43 రోజులకు ఇండియాకు చేరిన మృతదేహం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన జాలిగం అశోక్ బ్రతుకుదెరువు నిమిత్తం కొద్ది నెలల క్రితం సౌదీ అరేబియాకు వెళ్ళి శనివారం మృతదేహంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బోరున విలపించారు. ఫిబ్రవరి 9వ తేదిన సౌది అరేబియాలో గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించగా అక్కడి నుండి మృతదేహాన్ని రప్పించేందుకు కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ జెదా ఎంబసీతో మాట్లాడి మృతదేహాన్ని ఇండియాకు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతదేహాన్ని ఇండియాకు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకున్న కేంద్ర మంత్రికి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి కలిగిన వ్యక్తుల అరెస్టు



నవతెలంగాణ-సిద్ధిపేట

నిషేధిత గంజాయి మత్తు పదార్థం కలిగిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ మూర్తి ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిన్డెంట్ మర్ఫీ పర్యవేక్షణలో 21న రాత్రి సిద్దిపేటలోని రంగాధంపల్లీ నుండి పొన్నాల వెళ్ళు మార్గంలో ఎస్‌హెచ్‌ఓ, డీటీఎఫ్ టీమ్స్ గంజాయి, మత్తు పదార్ధంను కదారి ప్రశాంత్, పుట్ల వికాస్ అను వ్యక్తుల వద్ద నుండి 786 గ్రాములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద 2 మొబైల్స్, ఒక ద్వి చక్ర వాహనం ను స్వాధీన పరచుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్, ఎస్ఐలు విజయ్, కిరణ్ , హెడ్ కానిస్టేబుల్ చెన్న గౌడ్, అంజయ్య, రవీందర్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

బాధితుడికి రసమయి పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన ఎలుకంటి సురేందర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శనివారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధితుడిని పరామర్శించారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ అధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి అస్తవ్యస్తం

- ప్రజా ప్రతినిధులు లేక నిలిచిపోయిన కేంద్ర రాష్ట్ర నిధులు
- పేరుకే స్పెషల్ అధికారులు గ్రామపంచాయతీలను పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా లేవు
- అప్పులు చేసి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోగా గ్రామాల్లో స్పెషలాధికారుల పాలన పెట్టారు. గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవాల్సిన స్పెషల్ అధికారులు ఏ గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామ అభివృద్ధి కోసం అప్పులు చేసి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. స్పెషల్ అధికారుల పాలన ఉండడంతో కేంద్రం నుంచి గ్రామ పంచాయతీకి రావలసిన నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు తమ జీవితాలు సైతం గ్రామ అభివృద్ధి కోసం పెడుతూ అప్పుల పాలవుతున్నారు. ఇటు కుటుంబాన్ని పోషించలేక గ్రామపంచాయతీ అభివృద్ధి చేయలేక గ్రామంలోని సమస్యలు పరిష్కరించ లేక తీవ్ర మనోవేదనకు పంచాయతీ కార్యదర్శులు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించి, గ్రామపం చాయతీలకు రావలసిన నిధులను వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని గ్రామాలకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధులను విడుదల చేయడం లేదు. కేంద్రం నిధులు లేక రాష్ట్ర ప్రభుత్వం నిధులు లేక గ్రామాలు అభివృద్ధి కుంటుపడుతున్నాయని గ్రామాలలో సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. రానున్న వేసవికాలంలో ప్రజలకు త్రాగునీరు నష్టాలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

-సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎండి షఫీ మహమ్మద్

అసంఘటిత రంగ కార్మికుల అరెస్టు అప్రజాస్వామికం

-కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం: జీ.భాస్కర్



నవతెలంగాణ-దుబ్బాక

సామాజిక భద్రత, జీవన భృతి, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ మహాధర్నాకు వెళ్తున్న భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్ పోర్ట్, బీడీ కార్మికులైన అసంఘటిత రంగ కార్మికులను చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ అన్నారు. చట్టబద్ధ హక్కులైన పీఎఫ్, పెన్షన్, ఈఎస్ఐలను పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారని, ప్రధానంగా భవన నిర్మాణం,హమాలీలు,ట్రాన్స్ పోర్ట్,బీడీ కార్మికులు వంటి అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని కోరారు. హమాలీ, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, బీడీ కార్మికులకు జీవన భృతి రూ.4000 లు కనీస వేతనాల జీఓ విడుదల చేయాలని, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి బోర్డు నిధులు దుబారా చేయకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. బీడీ కార్మికుల కనీస వేతన జీఓను అమలు చేసి అసంఘటిత కార్మికులందరికీ పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులు హక్కుల కొరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, నాయకులు ఎల్లం, సాజిద్, లక్ష్మీనర్సయ్య, మహేష్, కృష్ణహరి, మల్లేశం, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అధికారులు, సిబ్బంది అందిపుచ్చుకోవాలి

- ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలి
- సీపీ.డాక్టర్ బి.అనురాధ



నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్

నూతన టెక్నాలజీని అధికారులు సిబ్బంది అందిపుచ్చుకోవాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని సీపీ. డాక్టర్ బి.అనురాధ అన్నారు. శనివారం సీపీ ఆఫీస్‌లో సిద్దిపేట రూరల్ సర్కిల్, దుబ్బాక సర్కిల్ పోలీస్ అధికారులతో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేయాలని, నిందితులను అరెస్టు చేసే విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలి, లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్, శ్రీధర్ గౌడ్, ఏఓ యాదమ్మ, ఎస్ఐలు అపూర్వ రెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణ, ఆసిఫ్, గంగరాజు, హరీష్, పరుశురామ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్



నవతెలంగాణ-చేర్యాల

ఉపాధి హామీ కూలీలు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో గుండ్ర రవీందర్ అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం చేర్యాల మండల, పట్టణ కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ.. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమై ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, దీనితో కూలీలు, గ్రామీణ పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు రెండు నెలలైనా కూలీ డబ్బులు రావడంలేదని, పొద్దంతా పనిచేసిన ఫలితం లేకుండా అధికారులు వ్యవరిస్తున్నారని, ఎండాకాలంలో సమ్మర్ అలవెన్స్‌ను, పలుగు, పార, తట్ట లాంటి పనిముట్లకు వాడకం చార్జీని ఇవ్వడం లేదన్నారు. క్రమక్రమంగా ఒక్కొక్క దానిని తగ్గించి కూలీలకు ఫలితం లేకుండా చేస్తున్నారని ఈ చర్యలను మానుకొని పెరుగుతున్న ధరల కనుగుణంగా రోజు కూలి రూ.800, కుటుంబానికి 200 రోజుల పని దినాలను కల్పించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, ఫోటో క్యాప్చరింగ్ విధానం తీసివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పేదలకు ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలందరూ ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని అప్పుడే హామీల అమలుకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో, మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, మల్కనీ ఎల్లయ్య, మర్యాల సత్తయ్య, జిడాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మరోసారి అధికారమిస్తే పంచభూతాలను దోచేవారే..!

- రాష్ట్ర ప్రజలు విజ్ఞులు... అందుకే వారికి తగిన బుద్ధి చెప్పారు
- కేసీఆర్, హరీశ్‌రావుల అవినీతి, అక్రమాలపైనే నా పోరాటం
- కేసీఆర్‌ను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తాం



నవతెలంగాణ-వర్గల్

రాష్ట్రంలో ఇసుక, మట్టి, నీటి దోపిడీ చేసిన కేసీఆర్ కుటుంబం మరోసారి రాష్ట్రంలో అధికారం చేపడితే పంచభూతాలను కూడా దోచేసేవారని డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పోరుబాట పాదయాత్రలో భాగంగా శనివారం గౌరారంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన ప్రసంగించారు. కేసీఆర్‌ను బర్తరఫ్ చేయాలని ఇప్పటికే కోర్టులో కొందరు ప్రజా ప్రయోజన వాజ్యం వేయగా, భయంతోనే ఆయన అసెంబ్లీకి వచ్చి వెళ్లినట్లు ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతి, అక్రమాలపైనే తన పోరాటం కాగా, నమ్మించి నట్టేట ముంచిన కేసీఆర్‌ను నిర్వాసిత గ్రామాల ప్రజలు నిలదీయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాయడం కాకుండా దమ్ముంటే అసెంబ్లీలో నిర్వాసిత గ్రామాల ప్రజల ఇబ్బందులు, సమస్యలను లేవనెత్తాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లక్షకు పైగా జీవోలు మాయం కాగా, వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేపట్టాలని సూచించారు. గజ్వేల్ ప్రజలను పట్టించుకోని కేసీఆర్‌ను గవర్నర్ బర్తరఫ్ చేయాలని డిమాండ్‌తో పోరుబాట పాదయాత్ర చేపట్టి సోమవారం రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు వివరించారు.

సీనియర్ సిటిజన్ సమస్యను పరిష్కరించిన సీఐ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ దాసరి రామలింగం సమస్యను సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పరిష్కరించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రామలింగం తన రిటైర్డ్ డబ్బులతో ఒక సంవత్సరం క్రితం నంగునూరు గ్రామ శివారులో కారంపురి వైకుంఠం వద్ద ఒక్క ఎకరం స్థలం నడవడానికి బాటను డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినాడు. రెండు నెలల క్రితం దాసరి రామలింగంకు ఇచ్చిన బాటను వైకుంఠం అల్లుడు వేముల రమేశ్ జేసీబీతో బాటలో నుండి నడవకుండా మొత్తం గుంతలు తీసినాడు. ఎవరికి చెప్పినా సమస్య పరిష్కరించకపోవడంతో ఫిర్యాది దాసరి రామలింగం సిద్దిపేట రూరల్ సీఐ కార్యాలయానికి వచ్చి ధరఖాస్తు ఇచ్చినాడు.ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్దేశంతో ఎలాంటి జాప్యం లేకుండా అదే రోజు సంఘటన స్థలానికి వెళ్లి బాటలో గుంతలు తీసిన స్థలాన్ని పరిశీలించి వైకుంఠం, వేముల రమేశ్‌ను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి వెంటనే బాటలో ఉన్న గుంతలు పూడ్చివేయించినాను. ఇప్పుడు రామలింగం అదే బాటలో నుంచి నడుస్తున్నాడు. త్వరగా సమస్యను పరిష్కరించినందుకు దాసరి రామలింగం శనివారం సీఐ శ్రీను కలవడానికి వచ్చేటప్పుడు శాలువా, స్వీట్స్ తీసుకుని వచ్చాడు. తన సమస్యను పరిష్కరించిన రూరల్ సీఐ శ్రీనుకు కృతజ్ఞతలు తెలిపి శాలువా స్వీట్స్ ఇవ్వడానికి ప్రయత్నించగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సీనియర్ సిటిజన్ అయిన రామలింగంను శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బంది లేకుండా తన సమస్యను త్వరగా పరిష్కరించిన సిద్దిపేట పోలీసులను అభినందించారు.

జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ వ్యాపారం

- మోయతుమ్మెద వాగు నుంచి బొలేరాలో ఇసుక తరలింపు
- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని రైతుల విన్నపం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి గ్రామ శివారులోని మోయ తుమ్మెద వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా జోరుగా సాగుతున్న పరిస్థితి నెలకొంది. విశ్వసనీయ సమాచారం మేరకు వింజపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్థుల సమాచారం మేరకు వాగు సమీపంలో ఉన్న బొలెరో వాహనాన్ని శనివారం పోలిసులు పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మోయతుమ్మెదవాగులో అక్రమంగా ఇసుకను బొలెరోలో తరలిస్తున్న వాహనాన్ని గ్రామస్థులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఠాణాకు తీసుకెళ్ళారు. గ్రామానికి చెందిన పలువురు ఇసుక అక్రమ రవాణదారులు సంబంధిత అధికారుల కళ్లుగప్పి బొలెరోల ద్వారా యథేచ్ఛగా అక్రమ ఇసుక తరలిస్తున్నారు. అలాగే గ్రామ సమీపంలో ఇసుక డంపులు పోసి రాత్రి వేళలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మోయతుమ్మెద వాగు పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. వేసవికాలం కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణ పనుల సాకుతో ఇతర ప్రాంతాలకు నిత్యం వాహనాలు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలి

- జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్



నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని వినియోగించుకొని ప్రభుత్వ పాఠశాలలో అద్భుతమైన ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ నుమరసీని బలోపేతం చేయడంలో కృత్రిమ మేధా (ఎఐ) కార్యక్రమాన్ని ఆయన మర్కుక్ ఎంఈవో వెంకటరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిషన్, మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృతిమ మేధా కార్యక్రమాన్ని మండ లంలో మొట్ట మొదటగా అంగడికిష్టాపూర్ పాఠశాలలో ప్రారంభించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. అతి త్వరలో మండలంలోని మరిన్ని పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మెన్ బాల్ రెడ్డి, ఉపా ధ్యాయులు సంతోషి మాత, హారిక, చిన్నికృష్ణ, నవీన తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం





నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలకు నీటి విలువ తెలిసే విధంగా ప్రజలకు ప్లకార్డులతో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు: ప్రతి ఒక్కరు నీటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, పొదుపుగా వాడుకోవాలని, నీటి నిల్వలు పెంచాలని కోరుతూ శనివారం సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలంలోని రాముని పట్ల, గోనెపల్లి గ్రామాల్లో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస సంస్థ మహిళా కోఆర్డినేటర్‌లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు నేటి ప్రాముఖ్యత గురించి తెలుసుకొని భవిష్యత్తులో భావితరాలకు నీటి కొరత లేకుండా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని, ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, పొలాల వద్ద ఫాం పొండ్స్ నిర్మించుకో వాలని, పొదుపుగా నీటిని వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని, వాతావరణ సమతుల్యతను కాపాడాలని గ్రామస్తులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ నాగరాజు రెడ్డి,తిరుపతి, మాజీ సర్పంచులు శ్రీనివాస్, స్వరూప, బాలవికాస మహిళ కోఆర్డినేటర్ లు అన్న మేరీ,సుజాత లక్ష్మి, సరిత, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ నందు ఐక్యూఏసి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాటర్ డే సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షతన నీటి సంరక్షణ (గ్రీన్ ఎర్త్) కార్యక్రమానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘువీర్ రిటైర్డ్ ఐఎఫ్ఎస్ పాల్గొని కళాశాల ప్రాంగణంలో





మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ, నీటి సంరక్షణ జీవవైవిద్యానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిత అబ్రహం నీటి పరిరక్షణ పట్ల కళాశాల నిబద్ధతను వెల్లడించారు. టెర్ర వెర్డే కళాశాల పర్యావరణ నీటి పరిరక్షణ నిబద్ధతకు నిదర్శనమని కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియానా, పి.శ్రీలత, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.జయరాజు, డాక్టర్ బాలచంద్రం, ఇతర అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్ధిపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ వాటర్ డే, వరల్డ్ ఫారెస్ట్ డే సందర్భంగా పర్యావరణ సుస్థిరత - ఆహార భద్రత అనే అంశంపై జాతీయ స్థాయి అంతర్జాల సదస్సు(నేషనల్ వేబినార్) ఆన్లైన్ వేదికగా నిర్వహించారు. దాదాపు 300 మంది వివిధ రాష్ట్రాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని వేబినార్ కన్వీనర్ డాక్టర్ కొమ్మిడి రాణి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలలో టాప్ గుర్తింపు పొందిన ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో అంతటా బయోడైవర్సిటీని కాపాడుకోవడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ప్రతిఒక్కరు భాద్యతగా వ్యవహారిం చాలని పేర్కొన్నారు. మరో వక్త ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర డాక్టర్ పడాల తిరుపతి జలవనరుల పరిరక్షణ అనే అంశంపై మాట్లాడుతూ.. నీటి వనరుల వినియోగంపై విస్తృత ఉపన్యాసాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ నుండి ఆర్జెడి డాక్టర్ రాజేంద్ర సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి అయోధ్య రెడ్డి, కళాశాల సిఓఇ డాక్టర్ గోపాల సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్ : అడుగంటి పోతున్న నీటిని సంరక్షించి భావితరాలకు అందించేల ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నెహ్రూ యువ కేంద్ర, సంకల్ప స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని పొదుపు చేసేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిని రాగుల మమతా యాదవ్ ,ఉపాధ్యాయురాలు కే అరుణ, జి అనిత, పి రాజమణి, బి కళావతి, ఎస్ నీరజ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక కాకతీయ టెక్నో హైస్కూల్లో శనివారం 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా "బిస్మాట్" (తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ..పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో అధిక సమయం వెచ్చించకుండా, చదువుపై ఆసక్తి పెంచుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను అలవర్చుకుంటే మానసిక, శారీరక శక్తి పెరుగుతుందన్నారు. సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాన్ని చూసి సంతోషాన్ని వ్యక్తం చేసి, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీ కబడ్డీ పోటీలు



నవతెలంగాణ-గజ్వేల్

ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎర్రవల్లి అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో మహనీయుల జయంతోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ చాంపియన్షిప్ ట్రోఫీ పోటీలును ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నిర్వహించుటకు శనివారం కబడ్డీ బ్రోచర్ని ఓపేన్ చేశారు. ఈ టౌర్నమెంట్ ఆహ్వానిత పురుషుల విభాగంలో సిద్దిపేట జిల్లా స్థాయి, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఆహ్వానిత మహిళా విభాగంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 500 మంది కబడ్డీ క్రిడాకారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ తెలిపారు. శనివారం బ్రొచర్ను రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ కబడ్డీ అసోసియేషన్ మాజీ ప్రధాని కార్యదర్శి కే.జగదీశ్వర్ యాదవ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, మద్ది మహేందర్ రెడ్డి చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కబడ్డీ అండ్ ప్రో కబడ్డీ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రో కబడ్డీ వ్యాఖ్యాతలు బండారి మాదవి, గంగాధర్ మల్లేష్ , తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రాయితీ పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాలి

-రాయపోల్ మండల వ్యవసాయ అధికారి రాసాల నరేష్



నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనిముట్లు యాభై శాతం రాయతీపై వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరుగుతుందని అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని రాయపోలు మండల వ్యవసాయ అధికారి రాసాల నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మహిళా రైతులు వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా ఎస్ఎంఏయం పథకం ద్వారా యాభై శాతం రాయతీపై రాయపోల్ మండల మహిళా రైతుల పేరు మీదనే భూమి ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. ట్రాక్టర్ ఆర్సీ భర్త గానీ లేదా మహిళా రైతు పేరు మీదనే ఉండాలి. ఈ పనిముట్లు అందుబాటులో కలవు. 1.బ్యాటరీ స్ప్రేయర్స్-4, 2.పవర్ స్ప్రేయర్స్ -4, 3.రోటోవాటర్స్-2, 4.కల్టివేటర్స్,కేజ్ వీల్స్-3, ఈ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 1.దరఖాస్తు పత్రము. 2.భూమి పాసుబుక్. 3.ఆధార్. 4. ట్రాక్టర్ ఆర్ సి(ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు)కావున ఆసక్తిగల మహిళా రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

ఏడు అంబులెన్సులు అందిస్తున్న ఎంపీకి కృతజ్ఞతలు

-కాళ్ళకుంట కాలనీలో హిందువులపై దాడినీ ఖండిస్తున్నాం
-బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మెదక్ ఎంపీ రఘునందన్ రావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తన పరిధిలోని ఏడు అంబులెన్స్లను రూ. మూడు కోట్ల 50 లక్షలతో అందించడం అభినందించదగ్గ విషయమని, ఎంపీకి కృతజ్ఞతలని బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ అన్నారు. శనివారం అర్బన్ మండల బీజేపీ నాయకులతో కలిసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా ప్రజాసేవలో భాగస్వామ్యమైతూ ప్రజల కోసం ఏడు అంబులెన్సు అందించిన ఎంపీ సేవలు మరువలేనివి అని అన్నారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని కాళ్ళకుంట కాలనీలో హిందువులపై దాడి జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే పార్టీ పరంగా కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. సమావేశంలో అర్బన్ మండల అధ్యక్షులు వరప్రసాద్, శేఖర్ గౌడ్, సురేష్ గౌడ్, కార్తీక్, అనిల్, సత్యనారయణ, నాని, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు









నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర బీఆర్ఎస్వీ కమిటీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లకుండా చిన్నకోడూరు మండల నాయకులను తెల్లవారుజామునే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు పోలీసులు తరలించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు గుజ్జ రాజు, నాయకులు పడిగే లింగం, చెట్టుపల్లి భానుచందర్, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, రంజిత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్ : బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు బీఆర్ఎస్వి నాయకులను ముందస్తు అరెస్టు చేయడం ఖండిస్తున్నామని బీఆర్ఎస్వి జిల్లా నాయకులు అనాజీపూర్ భార్గవ్ అన్నారు. శనివారం పోలీసులు భార్గవ్ను ముందస్తు అరెస్టు చేసి రాయపోల్ పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 నెలల కాలంలోనే కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆ బడ్జెట్లో ఏ ఒక్క రంగానికి కూడా ఉపయోగకరంగా లేదని కేవలం అంకెల గారడిగా భట్టి విక్రమార్క బడ్జెట్ ఉందన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

నవతెలంగాణ-కోహెడ: అక్రమ అరెస్ట్లు అప్రజాస్వామికమని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు సైఫోద్దీన్ అన్నారు. శనివారం రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్వీ ఇచ్చిన పిలుపు మేరకు ఆయనను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నెలలు కావస్తున్న విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజల గొంతునొక్కుతుందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 15 శాతం విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ-నంగునూరు : రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం కాంగ్రెస్ సర్కార్కు తగదని బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు గోవిందారం రవి, మాజీ మండలాధ్యక్షుడు బిక్షపతి నాయక్ ఆరోపించారు. శనివారం మండలంలోని రాజగోపాల్ పేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించినట్లు వారు చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ లో 15 శాతం విద్యా రంగానికి కేటాయించాలని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన వారిని అరెస్టు చేయడం తగదన్నారు.

వంటిమామిడి సర్కిల్ వద్ద ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం



నవతెలంగాణ-ములుగు

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకోవడానికి వెళ్తున్న ఎమ్మెల్సీకు శనివారం ఉదయం వంటిమామిడి సర్కిల్ వద్ద రాష్ట్ర బీఆర్ఎస్ యూత్ వింగ్ అండ్ ఏజెడ్ ఫౌండేషన్ చైర్మెన్ జుబైర్ పాషా ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారీ గజమాలతో సత్కరించిన ముదిరాజులు

సిద్దిపేట జిల్లా సరిహద్దు వంటిమామిడిలో శనివారం ఎమ్మెల్సీ కవితకు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని గజమాలతో సత్కరించగా, వాహనాల కాన్వాయ్తో కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముదిరాజుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తడం పట్ల ముదిరాజులు ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు,



ధన్యవాదాలు తెలిపారు. అలాగే బీసీడీ నుంచి ఏ కు రిజర్వేషన్ మార్చే వరకు తమకు మద్దతుగా నిలవాలని, చెరువులు కుంటలపై పూర్తి హక్కులు కల్పించే వరకు అండగా నిలవాలని, చేపల పెంపకానికి ప్రభుత్వం నుండి నిధులు సాధించాలని ఆకాంక్షించారు. ముదిరాజులు ఎప్పుడూ ఎమ్మెల్సీ కవితకు రుణపడి ఉంటామని వివరించారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-గజ్వేల్

ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా స్థానిక గజ్వేల్ పట్టణంలోని మోచి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బైరి రవి ఆధ్వర్యంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకొని వర్గీకరణ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మైసరాములు మాదిగ మాట్లాడుతూ.. ఒకే కండువా ఒకే నినాదం ఎత్తుకొని పార్టీలకు అతీతంగా ఎవ్వరు అధికారంలో ఉన్న వారికి ఎదురు నిలిచి పోరాడిండు మందకృష్ణ మాదిగ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు కే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బైరి సురేందర్, వేణుగోపాల్ కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గడ్డమీద ఆనంద ఎస్ఎస్ యాదగిరి, బాల నర్సయ్య, ఎస్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో నిరుపేద రెడ్డిలకు అవకాశం కల్పించాలి

-రెడ్డి సామాజిక వర్గం నాయకుడు నరోత్తంరెడ్డి డిమాండ్



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుపేద రెడ్డి యువకులకు చోటు కల్పించాలని రెడ్డి సామాజిక వర్గం నాయకుడు బూసిరెడ్డి నరోత్తం రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేద రెడ్డి లకు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఆర్థికంగా వెనుకబడిన యువతి యువకులు ఎంతోమంది ఉన్నారని, వారు కష్టపడి చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి దొరకక నానా అవస్థలు పడుతూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద రెడ్డిల ఆర్థిక స్తోమతను గుర్తించి వారిని కూడా ఈ పథకంలో అర్హులుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

మహా పాదయాత్రకు స్వాగతం తెలిపిన బీఆర్ఎస్



నవతెలంగాణ-మర్కుక్

రామగుండం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొరికంటి చందర్ చేపట్టిన మహా పాదయాత్ర ఆరో రోజుకు చేరుకుంది. శనివారం మధ్యాహ్నం మర్కుక్ మండల పరిధిలోని గణేపల్లి వద్ద ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్రెడ్డి, బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్రెడ్డి , మర్కుక్ బీఆర్ఎస్ నాయకులు చందర్కు వీర తీలకం దిద్ది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామగుండం నుంచి ఇక్కడ వరకు సుమారు 180 కిలోమీటర్లు కాలి నడకన వచ్చామన్నారు. 15 నెలలుగా రామగుండం నియోజకవర్గంలో నీళ్ళు లేక చెరువులు, కుంటలు ఎండిపోయన్నారు. వెంటనే నీళ్ళను విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో అమర నిరాహార దీక్ష చేపడతాన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ సర్పంచులు మంజుల శ్రీరాములు, అచ్చంగారి భాస్కర్, గడ్డం ప్రసాద్ యాదవ్, ఎర్రబాగు ఆశోక్, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు రాజబోయిన కృష్ణ, యాదవ్, గోలి నరేందర్, మాజీ ఉపసర్పంచ్లు గుర్రాల స్వామి, పుట్ట మహేష్,బీఆర్ఎస్ నాయకులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ , యావగారి సంతోష్ రెడ్డి, పత్తి బాబు యాదవ్, సాయిని మహేష్,సిలివేరి కిష్టాగౌడ్ ,బాలనర్సయ్య, కరుణాకర్ , తదితరులున్నారు.

పోరు బాటలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

చలో రాజ్ భవన్ గజ్వేల్ గల్లీ నుంచి గవర్నర్ గడప దాక పోరు బాట ఫామ్ హౌస్ నేత, ప్రజా సొమ్ము మేత.. మాకొద్దు కేసీఆర్..అనే నినాదంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అధ్వర్యంలో చేపట్టిన పోరుబాట పాదయాత్ర శనివారంతో మూడో రోజుకు చేరుకుంది. ఈ పాదయాత్రలో పాములపర్తి మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరిలు మాట్లాడుతూ.. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ సీఎం కేసీఆర్ 15 నెలల నుంచి గజ్వేల్ ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయ డంఖా మోగిచటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు శ్యాంప్రసాద్ గౌడ్, మొండి బిక్షపతి, క్రాంతి కుమార్, సిహెచ్ రవి, తదితరులున్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగం

-బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు అనుమాండ్ల రాజిరెడ్డి

నవతెలంగాణ-రాయపోల్



నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు అనుమండ్ల రాజిరెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన సంఘం స్వరూప కిషన్ రూ. 10,500 వేల సీఎంఆర్ఎఫ్చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాదాస్ మురళి గౌడ్, మహమ్మద్ రఫీ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన వంశానికి మూల పురుషుడు శాతవాహునుడు

-కుమ్మర సంఘం రాష్ట్ర నాయకుడు దరిపల్లి చంద్రం



నవతెలంగాణ-సిద్ధిపేట : శాత వాహన వంశానికి మూల పురుషుడు శాతవాహునుడు అని కుమ్మర సంఘం రాష్ట్ర నాయకుడు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట పట్టణంలో బీజేఆర్ జంక్షన్‌లో సిద్ధిపేట జిల్లా కుమ్మర సంఘం అసోసియేట్ అధ్యక్షులు తరిగొప్పుల రామచంద్రం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా చంద్రం హజరై మాట్లాడుతూ.. మౌర్య సామ్రాజ్యంలో సామంత రాజుగా ఉండి, మౌర్య సామ్రాజ్యం పతనానంతరం, స్వతంత్ర రాజుగా ప్రకటించుకొని శాతవాహన వంశానికి ఆద్యుడైనాడని, శాలివాన చక్రవర్తి భారతదేశం లోనే గొప్ప చక్రవర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాదారి నాగరాజు, పిడిశెట్టి రాజు, ధర్పల్లి భూమయ్య, రాజలింగంలు పాల్గొన్నారు.

వైభవంగా మూల నక్షత్ర విశేష పూజలు

నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో శనివారం మూల నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, చండీ హెూమం, ప్రత్యేక పూజలు, అలంకరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూల నక్షత్ర మహెూత్సవానికి వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అంకురార్పణ చేశారు. ఆలయ సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూల మహెూత్సవం సందర్భంగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

రామకోటి ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల దీక్ష

-మొదసారిగా పాల్గొన్న బంగ్లావేంకటాపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ముచ్చటగా ముడోసారి భద్రాచల సీతారాముల కల్యానానికి తెలంగాణ రాష్ట్రం నుంచి 250కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్ప దీక్షతో ప్రతి భక్తునిచే గ్రామ, గ్రామాన శ్రీకారం చుట్టిందని గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థఅధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. శనివారం గజ్వేల్ మండలం బంగ్లావేంకటాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్దకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని గోటితో వడ్లను ఓలిచారు. ఈ కార్యక్రమంలో బాకీ నర్సింలు, పాశం బాపిరెడ్డి, మార్కటం వెంకటేశం, పంజాల రవేందర్ గౌడ్, సురేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విన్నర్ గోల్డ్-ఎన్ఎంహెచ్8413తో అధిక దిగుబడులు



నవతెలంగాణ-మద్దూరు : నూజీవీడు సీడ్స్ వారి విన్నర్ గోల్డ్-ఎన్ఎంహెచ్8413తో మొక్క జొన్న పంటలో అధిక దిగుబడులు సాధించొచ్చని కంపెనీ ప్రతినిధులు అన్నారు. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలంలోని భైరాన్‌పల్లిలో రైతులు సాగు చేసిన గోల్డ్-ఎన్ఎంహెచ్8413 పంట పొలాల్లో శనివారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోల్డ్-ఎన్ఎం హెచ్8413 రకం నూతన వంగడానికి 'డబుల్ రూట్' సిస్టం ఉండడం వల్ల.. గాలి మరియు వర్షాలకు నేలకొరగదన్నారు. ఏకరీతి కంకులతో.. కొన వరకు గింజలు నిండి ఉంటాయన్నారు. అలాగే అధిక షెల్లింగ్ శాతం ఉండడం వల్ల రైతులకు మంచి దిగుబడులు వస్తాయన్నారు. అంతేకాకుండా ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు.

ఇందూరులో ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

- ట్రైసోల్ గ్లోబల్ సర్వీసెస్ కు 9 మంది విద్యార్థులు ఎంపిక
- ఇందూరు కళాశాల ప్రిన్సిపాల్ వీపీ రాజు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ట్రైసోల్ గ్లోబల్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు 9 మంది విద్యార్థులు సాఫ్ట్వేర్ ఇంజనీర్ల హెూదాలో ఉద్యోగం సాధించారని ఇందూర్ కళాశాల ప్రిన్సిపల్ వీపీ రాజు అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులో ఉన్న ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైసోల్ గ్లోబల్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆన్ క్యాంపస్ పేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన 110 మంది బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొనగా ఆన్లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ ఇంటర్వ్యూ పద్ధతుల ద్వారా 9 మంది విద్యార్థులను ఫైనల్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి సంవత్సరానికి నాలుగు లక్షల రూపాయల జీతంతో సాఫ్ట్వేర్ ఇంజనీర్



హెూదాలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ విష్ణు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రవీణ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బెనర్జీ, ప్లేస్మెంట్ ఆఫీసర్ గోపికృష్ణ, పీఆర్ఓ బొడ్డు రఘు పాల్గొన్నారు.

హరీశ్‌రావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులు లేదు

నవతెలంగాణ-నంగునూరు



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులు లేదని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, మాజీ మండల అధ్యక్షుడు బిక్షపతి నాయక్ సూచించారు. శనివారం నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించి రైతుల మొఖంలో సంతోషాన్ని నింపిన ఘనత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు లదే అనే విషయం యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలు కి తెలుసన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అసత్య ప్రచారాలు ప్రజలు ఎప్పటికీ నమ్మరని ,దొంగ హామీలతో ప్రభుత్వంలోకి వచ్చిన మీరు ప్రజల్ని దొంగ మాటలతో మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ లింగం, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శి బోదాసు శ్రీకాంత్, డి. రాజు, బన్నీ యాదవ్, నరేశ్ ,సురేశ్ ,జైపాల్, ఉపేందర్, అజ్జు, హరి, వంశీ, హరీశ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

-బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మండలంలోని వెంక ట్రావుపేట గ్రామంలో బండారి రాజగౌడ్ నివాసం నుంచి పోచమ్మ దేవాలయం వరకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులను గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింలు తో పాటు ఇటీవల గ్రామ మత్స్య శాఖ చైర్మెన్‌గా ఎన్నికైన కత్తుల నరేష్, ముదిరాజ్ సంఘం పెద్దలుగా ఎన్నికైన నాగులపల్లి కనకయ్య, ఎంగలి సత్తయ్యలతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం కు సహకారం అందించిన తమ్మలి యాదయ్య లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికారి పెంటోజీ, జంగం పెంటయ్య, బండారు స్వామి గౌడ్, పిట్ల వెంకటయ్య, ఓలపు సత్యనారాయణ, సిరిసిల్ల రాజేష్, పులిగారి శివ య్య, కొమురయ్య, సుతారి రాములుపాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తితో దిగుబడులు అధికం



నవతెలంగాణ-కోహిర్

అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులు అధిక దిగుబ డులు సాధించొచ్చని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రాహు ల్ విశ్వకర్మ అన్నారు. మండలంలోని పీచర్యాగడి రైతువేదిక వద్ద ఏరువాక కేంద్రం సంగుపేట్ వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి పంటపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేస్తే.. సాధాం ణం కంటే మేలైన దిగుబడి వస్తుందన్నారు. ఎకరాకు 22,222 లేదా 25,000 మొక్కలు వస్తాయని.. తక్కువ పంటకాలం వల్ల ఒకేసారి పూత, కాయలు రావడం జరుగుతుం దన్నారు. దాంతో పంట తొందరగా చేతికి వస్తుందన్నారు. అలాగే గులాబి రంగు, కాయ తొల్చు పురుగు బారినుంచి కూడా తప్పించుకొని నికర ఆదాయం వస్తుందన్నారు. పంట కాలం తగ్గి రైతుకు రెండు పంట సాగు చేసుకుంటాము ఆస్కారం ఉంటుంద న్నారు. కృషి విజ్ఞాన కేంద్రం-దిద్ది (డీడీఎస్) ప్రోగ్రాం కోఆర్డినేటర్ వం ప్రసాద్.. పత్తిసాగు, పంట యాజ మాన్య పద్ధతులు, అధిక సాంద్రత పద్ధతి వల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరి ంచారు. ఈ యాసంగి లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధ తుల గురించి శాస్త్రవేత్తలు రమేష్, స్నేహలత వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బిక్షపతి, కోహిర్ మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏరువాక కేంద్రం-1 శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

25న ఛలో హైదరాబాద్

నవతెలంగాణ-కొండాపూర్



గ్రామపంచాయతీ బకాయి వేతనాలు చెల్లించాలని కోరు తూ ఈనెల 25న హైదరాబాద్ ఇంది రా పార్క్ వద్ద చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయా లని గ్రామపం చాయతీ యూని యన్ మండల కార్యదర్శి వెంకయ్య డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను పెన్షన్‌దారులకు మళ్లించడం సరికా దన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలుడు అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-శివ్వంపేట



పొలానికి వెళ్ళొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని దంతాన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దంతాన్ పల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మల్లేష్ పెద్ద కొడుకు రేవంత్ కుమార్ (16) తూప్రాన్ పట్టణంలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో మల్లేష్ ఇంట్లో నిద్రిస్తుండగా పొలం వద్ద ఉన్న బర్రెలకు నీళ్లు తాపి వస్తానని తల్లికి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన రేవంత్ కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. రేవంత్ కుమార్ ఆచూకి కోసం చుట్టుపక్కల, తెలిసిన వారివద్ద వెతికిన ఫలితం లేకపోయింది. దీంతో శనివారం రేవంత్ తండ్రి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

ధర్మసాగర్ చెరువు వద్ద మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కంది : మండల కేంద్రంలోని చిమ్నపూర్ గ్రామ శివార్లలో గల ధర్మసాగర్ చెరువు వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర తెలిపిన వివరాల ప్రకారం.. చిమ్నాపూర్ తండా ధర్మసాగర్ చెరువు ఒడ్డున ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు నల్ల రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని.. దానిపై 07 అనే నెంబర్ ముద్రించి ఉన్నదని పోలీసులు గుర్తించారు. మృతదేహం ఎముకల ను బట్టి చూస్తే అతడు చనిపోయి సుమారు మూడు నుంచి ఐదు నెలల కాలం కావస్తున్నట్టు చెప్పారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా మిగతా వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే.. వెంటనే సంగారెడ్డి రూరల్ ఎస్సై 8712656746 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

బర్త్ డే కేక్ కటింగ్‌లో గొడవ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

బర్త్ డే కేక్ కటింగ్ సమయంలో తలెత్తిన గొడవ పెద్దగా మారి యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఇంటిపై దాడి చేసుకునే వరకు వచ్చిన సంఘటన సిద్దిపేట పట్టణంలోని కల్వకుంట కాలనీలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం కల్వకుంట కాలనీకి చెందిన బాసంగారి లలిత కుమారుడు క్రాంతి కుమార్ తన స్నేహితుడు మంగళారపు రవి కిరణ్ బర్త్ డే సందర్భంగా తన ఇంటి ముందు బైక్‌పై కేకు పెట్టి కట్ చేయిస్తున్న సమయంలో అటుగా వెళుతున్న అదే కాలనికి చెందిన అశ్వక్ అనే వ్యక్తి వారితో వాగ్వాదానికి దిగి బండిని తన్ని, కేకును కింద పడి వేశాడని, అనంతరం తన స్నేహితులు నవాజ్, సంజర్, సాయిబాబాలతో కలిసి వారిపై దాడికి దిగాడని, ఆ సమయంలో అడ్డుకోవడానికి వచ్చిన లిఖిత్, గుణవిజ్ఞాన్, రవిచరణలను సైతం వారు కొట్టినట్లు తెలిపారు. అడ్డుకోవడానికి వచ్చిన క్రాంతికుమార్ తల్లి లలిత తో పాటు, కుటుంబ సభ్యులు జయమ్మను సైతం కొట్టి, వారి ఇంటి పై దాడి చేసి కిటికీలు, టైల్స్, గేటును ధ్వంసం చేయడంతో పాటు, ఇంటి ముందు ఉన్న యాక్టివా బండిని సైతం ధ్వంసం చేశారని లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-శివ్వంపేట : మత సామరస్యానికి ప్రతీక పవిత్ర రంజాన్ పండగ అని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త అన్నారు. గూడూరు, శివ్వంపేట గ్రామాలకు చెందిన ముస్లిం, మైనార్టీ సోదరులకు శనివారం అతను రంజాన్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్ గుప్త మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో, ఆనందంగా రంజాన్ పండగను చేసుకోవాలని సూచించారు. ముస్లిం, మైనార్టీ సోదరులకు ముందస్తు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు దావుద్, అబ్దుల్ అజీజ్, షేక్ అలీ, వారాల గణేష్, కములయ్యగారి వెంకటేష్, దేవనబోయిన కృష్ణ, ఇసారపు రాజుగౌడ్, వజ్జ శ్రీనివాస్, బిజిలీపురం సత్తయ్య, బాసంపల్లి ప్రభులింగం గౌడ్, ఇసారపు శ్రీనివాస్ గౌడ్, శ్యామ్, మహేష్, కార్తీక్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

